

మరణం తర్వాత కూడా వచ్చేవి
తటవర్తి వీరరాఘవరావు

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# మరణం తర్వాత కూడా వచ్చేవి



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు

ప్రథమ ముద్రణ : మే, 2024
కాపీలు : 1,000

వెల : రూ. 70/-

పుస్తకముల కొరకు
తటవర్తి వీర రాఘవరావు
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్ : 9440309812
email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


1) మరణం తర్వాత కూడా వచ్చేవి ................................ 3

2) వాసనలు................................................... 5

3) సంస్కారాలు ........................................... 10

4) కర్మలు ................................................... 24

5) కర్మ – అకర్మ (శ్రీ కృష్ణుల వారి భోధ)........................ 34

6) ధ్యానం అంటే? ........................................... 38

7) కర్మలో అకర్మ – అకర్మలో కర్మ– శ్రీ కృష్ణభగవానుడు....... 42

8) జ్ఞానం..................................................... 47

9) జ్ఞానం పొందడం వల్ల వచ్చే లాభాలు ........................ 56

# మరణం తర్వాత కూడా వచ్చేవి

మనం గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సాధన, పొందుతున్న జ్ఞానం వల్ల ఈ ఆధ్యాత్మిక మార్గంలో ఎంత ఎదుగుతామో! అదంతా మన రాబోయే జన్మకి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఈరోజు మనం బాగా డబ్బు సంపాదిస్తే అది ఈ జన్మలోని భవిష్యత్తుకు లాభం చేకూరుతుంది, ఎంతో సుఖాన్ని కలుగజేస్తుంది.

అలాగే మనం ఇవాళ నేర్చుకున్న విద్య రేపు ఇంకా ఎదగడానికి ఉపయోగిస్తుంది. మీరు హైస్కూల్ లెవెల్‌లో బాగా ఉత్తీర్ణులు అవుతే, కాలేజీ లెవెల్ కి వెళ్తారు, కాలేజీ లెవెల్‌లో ఉత్తీర్ణత సాధిస్తే, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కి వెళ్తారు. అలా కష్టపడి చదివింది, వృధా కాదు. భవిష్యత్తు ఎదుగుదలకి ఉప యోగపడుతుంది.

అలాగే, ఈ జన్మలో మనం కష్టపడి సాధించింది వృధా కాదు, మరుజన్మకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక క్లాస్‌లో ఉత్తీర్ణులు అయితే తర్వాత క్లాసులోకి వెళ్తాము. అంతేకానీ, ఆ క్లాస్ నుండి కిందకు రాము. అలాగే ఈ జన్మలో నేర్చుకున్నవి, సాధించినవి తర్వాత జన్మకి ఉపయోగ పడతాయి. అలా ఈ జన్మలో కష్టపడింది కానీ, సాధించింది కానీ ఏది వృధా కాదు.

ఇక్కడ ఎంత కష్టపడతారో అదంతా భవిష్యత్తులో లాభమే. అంతా ఏమనుకుంటారంటే? చచ్చిపోతే అంతా అయిపోతుంది, ఇంక ఏమీ వుండదని అనుకుంటారు. కాని చచ్చిపోయినా కూడా మనం వుంటాము, అంతేకాదు చేసింది, సాధించింది కూడా వృధా కాదు. చాలామందికి తెలిసింది ఏమిటంటే దేహాన్ని కాల్చేస్తారుకదా? ఉండేది బూడిదే కదా అనుకుంటారు. కాని దేహం కాలుతుంది, కానీ ఇక్కడ చేసింది మటుకు వృధా కాదు. అందుచేత ఇక్కడ మనం చేసేది, సాధించేవి, నేర్చుకునేవి, మన కూడా వచ్చేవి ఏమి ఉన్నాయి?

అన్నది తెలుసుకుందాము.

అంటే గత జన్మలో చేసినవి, మన కూడా వచ్చిన వాటిని బట్టే ఇప్పుడు మన జీవితం వుంది. అలాగే, ఇప్పుడు సాధించింది మరుజన్మకి ఉపయోగ పడుతుంది.

అందుచేత మరి మన కూడా వచ్చేవి ఏమిటో తెలుసుకుందాం.

మన కూడా వచ్చే వాటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు, అవేమిటంటే?

1. వాసనలు, 2. సంస్కారాలు, 3. కర్మలు, 4. జ్ఞానం

ఇక్కడ "వాసనలు" అంటే ఒక రకంగా చెప్పాలంటే "ఆసక్తులు, వాటినే ఇష్టాలు అనవచ్చు".

సంస్కారాలు అంటే "అలవాట్లు".

కర్మలు అంటే "చేసిన పనులు, మాటలు".

జ్ఞానం అంటే "ఆత్మకు లాభించేది", "ఆత్మకు ఉన్నతి కలిగించేది."

ఇవన్నీ కంటికి కనిపించక పోయినా మానవుడు చనిపోయిన తరువాత కూడా వస్తాయి. వీటి గురించి కొంచెం వివరంగా తెలుసుకుందాము.

# వాసనలు

ఈ వాసనలు మూడు రకాలు

1. దేహవాసన, 2. లోకవాసన, 3. శాస్త్ర వాసన.

1.దేహవాసన:- దేహాభిమానంతో అంటే దేహంతో తాదాప్యం చెందితే దేహవాసన అంటారు.

2. లోక వాసన:- అంటే మనసుకు లోబడి మనసుతో తాదాప్యం చెందితే లోకవాసన అంటారు.

3. శాస్త్ర వాసన:- అంటే బుద్ధిని ఉపయోగిస్తూ, బుద్ధితో తాదాప్యం చెందితే అంటే బుద్ధితో చేసే పనులన్నీ శాస్త్రవాసన అంటారు.

ఒక రకంగా చెప్పాలి అంటే ఈ మూడు వాసనలు మానవులకు ఇనుప సంకెళ్ళులాంటివి. ఇవి దుఃఖాన్ని తొలగించలేవు, వీటి వల్ల మానవుడు మోక్షాన్ని పొందలేడు.

అందుచేత ఈ దేహ వాసనలు గురించి ఇంకొంచెం తెలుసుకుందాం.

**1. దేహవాసన:-** అంటే దేహం కోసం చేసేవన్నీ దేహవాసనలు. సంసారం, కుటుంబం, భార్య, భర్త, పిల్లలు, బంధువులు ఇలాంటి వారి మీద మమకారంతో వారి కోసమే జీవించడం, తన సమయం, జీవితమంతా వారికే వెచ్చించటం దేహావాసన అంటారు.

ఎవరైనా అడిగితే అంతకన్నా ఏముంది? ఇంకేమి చెయ్యాలి? అదే తన బాధ్యత  అంటారు. ఆలా చనిపోయే వరకు వారి కోసమే కష్టపడటం, కృషిచేయటం దేహవాసన  అంటారు.

వీరికి దేహం తప్ప ఇంకొక ఆలోచన ఉండదు. ఎంతసేపూ దేహసుఖం, దేహ ఆరోగ్యం, దేహ సౌష్టవం, దేహ అందం తప్ప ఇంకేమి వుండదు. ఇలాంటివన్నీ దేహవాసనలు.

కానీ, ఒక రకంగా చెప్పాలంటే, ఈ దేహం అన్నది "రోగాలు పుట్ట-

బాధల తుట్ట” అన్న సంగతి తెలుసుకోవాలి. ఇది తెలుసుకుంటే, ఈ దేహం మీద మమకారం, అభిమానం తగ్గించుకుంటారు. యోగులు దేహాన్ని మలభాండం అన్నారు.

**2. లోకవాసన:-** ఇది మనసుకు సంబంధించింది. వీరిలో మనసు యొక్క ప్రాముఖ్యత ఎక్కువ ఉంటుంది. వీరు లోకం కోసం, లోకుల కోసం ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. వీరికి మనసుకు సంబంధించిన కోరికలు ఎక్కువ వుంటాయి. అంటే అన్ని రంగాల్లో అందరికంటే అధికంగా ఉండాలని. వాటికోసమే జీవితమంతా వెచ్చిస్తారు.

అంటే ఒక్కొక్కడికి ఒక్కొక్క రంగంమీద ఇష్టం ఉంటుంది. వారు దాంట్లో నిష్ణాతుడు అవ్వాలి, చాంపియన్ అవ్వాలి అని వారి సమయాన్ని, సమస్త శక్తులు దానికే వెచ్చిస్తారు. ఆలా కొంతమంది సంగీతం మీద, కొంతమంది ఆటల మీద, కొంతమంది సినిమాల్లో, కొంతమంది రాజకీయాల్లో, కొంతమంది డబ్బు సంపాదనలో దృష్టి పెడుతూ ఉంటారు. వాళ్ల మనసు అదే ఇష్టపడుతుంది, అదే కోరుకుంటుంది.

అందుచేత వారు ఆ పనే చేస్తూ ఉంటారు. దానికి టాప్ ప్రయారిటీ ఇస్తారు, అంటే వారికి ఇష్టమైన వాటికే ప్రాముఖ్యం ఇస్తారు. ఇంక దేని మీదకి దృష్టి పోదు. వీరు తన కంటే కూడా ఇతరుల గురించి ఎక్కువ ఆలోచిస్తారు. దీనినే లోక వాసన అంటారు.

**3. శాస్త్రవాసన:-** ఒక రకంగా చెప్పాలంటే ఇది బుద్ధికి సంబంధించింది. బుద్ధి స్థితిలోకి వచ్చినవారు చేసే పనులన్నీ ఇలాగే ఉంటాయి.

వీరు శాస్త్రాలన్నిటినీ అధ్యయనం చేస్తారు. వాటినే పూర్తిగా విశ్వసించి, దానికి అనుగుణంగా జీవించడానికి ప్రయత్నిస్తారు. దీన్ని శాస్త్రవాసన అంటారు.

మనం గమనించినట్లయితే, దేహం మీద ఆసక్తి ఉన్నవారు దేహ సంబంధమైనవే చేస్తుంటారు. అలాగే లోకవాసన మీద ఆసక్తి ఉన్నవారు మనసుకు సంబంధించినవి చేస్తుంటారు. బుద్ధి మీద ఆసక్తి ఉన్నవారు బుద్ధి

సంబంధమైన పనులు చేస్తూ ఉంటారు.

ఇక్కడ ఏమవుతుంది అంటే వీళ్ళు దేంట్లో ఆసక్తి చూపించి, ఆ పనులు చేస్తూ ఉంటారో, ఆవాసనలే, ఆ ఆసక్తులే వచ్చేజన్మకు కూడా వస్తాయి. ఇంచుమించు ఈ జన్మలో ఎలా జీవిస్తారో అలాగే మరు జన్మలో కూడా జీవిస్తూ ఉంటారు, ఇంకొక రకంగా జీవించరు. ఉదాహరణకి గత జన్మలో మంచి సంగీత విద్వాంసుడు అయితే ఈజన్మలో చిన్నప్పటినుండే అద్భుతంగా పాటలు పాడుతూ ఉంటాడు.

ఈ జన్మలో చాలా చిన్న వయసులోనే భగవద్గీత శ్లోకాలు చెప్పాడనుకోండి, వాడు గత జన్మలో భగవద్గీతలో పండితుడని తెలుసుకోవచ్చు.

అలాగే వాడు చిన్నవయస్సులోనే కారు నడిపేస్తూ ఉంటే వాడు గత జన్మలోనే డ్రైవింగ్ లో నిష్ణాతుడు అనుకోవచ్చు. ఇలాంటివి యూ ట్యూబ్ లో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ముఖ్యంగా దీనంతటికీ కారణం గతజన్మనుంచి వచ్చిన వాసనలే అని తెలుసుకోవాలి.

ఈ వాసనలు అంటే ఆసక్తులు జన్మజన్మల నుంచి జీవుడిని వదిలి పెట్టకుండా వస్తాయి. అందుచేత ఈ జన్మలో ఉన్న ఆసక్తులు, ఇష్టాలు మనల్ని వదిలిపెట్టవు అని మనం తెలుసుకోవాలి.

అందుచేత ప్రతిఒక్కరికీ మరుజన్మ వుంటుంది కాబట్టి ఈ జన్మలో మంచి వాసనలు కలిగివుండాలి, మంచి ఇష్టాలు వుండాలి.

అప్పుడు అవి భవిష్యత్తులో అంటే మరుజన్మకి ఎంతో ఉపకరిస్తాయి. అందుచేత ఈ జన్మలో సాధించింది, చేసింది, వృధా కాదు అని గుర్తు పెట్టుకోవాలి. అందుచేత ఈ జన్మలో మీరు పిల్లల మీద, భార్య మీద, భర్త మీద, ధనం మీద మమకారం ఎక్కువ ఉందనుకోండి, అది ఈ జన్మతో పోదు, వచ్చే జన్మకి కూడా అదే మమకారంతో ఉంటారు, ఆధ్యాత్మికత మీద ఆసక్తి చూపించరు, జ్ఞానం పొందే ప్రయత్నం చేయరు.

ఇప్పుడు మనం చూస్తున్నాము, ఎవరికైతే భార్య మీద కానీ, భర్త మీద

కానీ, పిల్లల మీద కానీ, ధనం మీద కానీ మమకారం వుంటుందో మోక్షం పట్ల ఆసక్తి చూపించరు, దుఃఖం నుండి బయటపడటానికి ప్రయత్నించరు. కానీ కష్టాలు వచ్చినప్పుడు నా పరిస్థితి ఇలా అయ్యిందే. నా జీవితం ఇలా అయ్యిందే. ఏం చేయాలి? అని చాలా బాధపడతారు.

అందుచేత ఈ జన్మలో దేహ వాసనలు, లోకవాసనలు వదిలించుకుంటే మరుజన్మలోనైనా ఆధ్యాత్మిక ఆసక్తి పెరిగి మోక్షంగురించి ప్రయత్నిస్తారు.

అందుచేత ఎవరైతే దుఃఖం నుండి బయట పడాలని అనుకుంటారో! వారు ఈ మూడు రకాల వాసనల నుంచి బయటపడాలి. అప్పుడే వారికి మోక్షం. అందుకే "వాసనాక్షయమే మోక్షము" అని అంటారు.

ఎవరికైనా జన్మ తప్పదు, శరీరం తప్పదు, జ్ఞానం పొందే ప్రయత్నం తప్పదు. కానీ దానికి ఈ వాసనలే ఆటంకం. ఈ వాసనలు కనపడవు, కానీ కూడా వస్తాయి. చూడండి ఒక ఇంగువ డబ్బాలో ఇంగువ వేశారు. కొన్నాళ్ళకి అది తీసేసి శుభ్రంగా కడిగినా ఇంగువ వాసనే వస్తుంది.

అలాగే ఈ జన్మలో సంసారాన్ని, ధనాన్ని అన్నీ వదిలివేసాము. అయినా మరుజన్మలో సంసారం మీద, ధనం మీద "ఆసక్తి", "ఇష్టం" పోదు. అలా వస్తూనే ఉంటుంది. వారికి ఎవరు ఎంత చెప్పినాఎక్కదు.

నువ్వు దేహం కాదు, నువ్వు మనసు కాదు, నువ్వు బుద్ధి కాదు, నువ్వు ఆత్మవి అని ఏంత చెప్పినా ఎక్కదు. దానికి ముఖ్య కారణం వాసనలు.

అందుచేత, కనీసం ఇప్పుడైనా అలాంటి నష్టం కలిగించే వాసనలను వదిలించుకోవాలి.

అందుకే పత్రి గారు ఈ నాలుగు పనులు చేయమన్నారు.

1. శ్వాస మీద ధ్యాస ఉంచి తీవ్ర ధ్యాన సాధన, 2. జ్ఞానవంతమైన పుస్తకాలు చదవడం, 3. జ్ఞానవంతమైన సందేశాలు వినడం, 4. ఈ మార్గంలో సేవలు చేయడం. ఎప్పుడైతే ఈ జన్మలో ఇవి చేస్తారో! ఆ వాసనలే మరుజన్మకు 'కూడా వస్తాయి'.

ఈ ధ్యాన మార్గంలోకి మనం చాలామందిని రమ్మంటాము కాని ఆసక్తి చూపించరు. కారణం వారు గత జన్మలో వీటి మీద ఆసక్తి చూపించ లేకపోవడమే కారణం. అందుకే అంటాము, గత జన్మ సంస్కారం ఉన్నవాడే జ్ఞానంలోకి వస్తాడు అని.

చూడండి మన భీమవరం క్లాసులకి  ఎన్ని ఊళ్ళ నుంచి వస్తున్నారు? అంటే దాని అర్థం  ఆ ఊర్లో ఎన్నో వేలమంది ఉండొచ్చు, లక్షల మంది వుండొచ్చు, కాని వచ్చేది ఇద్దరో! ముగ్గురో! మరి మిగతా వాళ్ళు ఎందుకు జ్ఞానం మీద ఆసక్తి చూపించడం లేదు? అంటే గత జన్మలో వాళ్ళకి వేరే విషయాల మీద ఆసక్తి వుండడం వల్లనే.

ఏది ఏమైనా ఈజన్మలో మనం చేసింది వృధా కాకూడదు. ఎందుచేతనంటే? ఈ జన్మలో సాధించింది, మరుజన్మకు ఎంతో ఉపయోగ పడుతుంది, లాభిస్తుంది.

ఈ సంవత్సరం కష్టపడి చదివితే పైక్లాసుకు వెళ్తాం కదా? అలాగే ఈజన్మలో కష్టపడితే మరుజన్మలో ఆధ్యాత్మికంగా ఇంకా ఉన్నతమైన స్థితికి ఎదుగుతాం. అందుచేత చేసినవన్నీ కూడా వస్తాయని మర్చిపోకూడదు.  కాని గుర్తుంచుకోండి… వేటిమీద మీరు మమకారాలు చూపిస్తారో, ఆ బంధువులు రారు, ఆ పిల్లలు రారు, భార్య రాదు, భర్త రాడు, ధనం రాదు కాని వాళ్ళ మీద మీకున్న ఆసక్తి, మమకారం అన్నవే మీ కూడా వస్తాయి.

అందుచేత మరుజన్మలో మరల అటువంటి జీవితాన్ని మీరు ఇష్టపడతారు.

అందుచేత భవిష్యత్తుని మంచిగా తీర్చిదిద్దుకోవాలి, ఇప్పుడున్నదేదో శాశ్వతం అని అనుకోవద్దు.

# సంస్కారాలు

ఇంతకుముందు వాసనల గురించి చెప్పుకున్నాము. ఇప్పుడు సంస్కారాల గురించి చెప్పుకుందాము. సంస్కారాలు అంటే అలవాట్లు. ఇవి మూడు రకాలు అని పెద్దలు చెబుతూ ఉంటారు.

అవి 1. మట్టి పెళ్ళ సంస్కారాలు.

2. కట్టె సంస్కారాలు.

3. బండ సంస్కారాలు.

చూడండి మట్టి పెళ్ళను నీళ్ళలో వేస్తే కాసేపటికి కరిగిపోతుంది. అదే కట్టెను నీళ్ళలో వేస్తే మెల్లిగా ఎప్పటికో మెత్తబడుతుంది. అదే ఒక బండని నీళ్ళలో వేస్తే యుగాలు అలా ఉంచినా కూడా అలానే ఉంటుంది.

ఈ అలవాట్లను కూడా పెద్దలు అలానే పేర్కొన్నారు. వీటిని బట్టి మనం ఎలాంటి సంస్కారాలు తెచ్చుకున్నాము అన్నది తేలికగా అర్థమవుతుంది.

**1) మట్టి పెళ్ళ సంస్కారాలు :–** అంటే ఎవరికైతే కొన్ని అలవాట్లు వుంటాయో, వాళ్లు పెద్దలు కానీ, గురువులు కానీ, యోగులు కానీ, యోగీశ్వరులు అంటే బుద్ధుడు, కృష్ణుడు, పత్రీజీ లాంటి వాళ్ళు నీకున్న అలవాట్లు తప్పు, వాటి వల్ల నువ్వు ఎంతో నష్టపోతావు, కష్టాల పాలవుతావు, వాటిని మార్చుకో అని చెపుతారు.

ఆలా చెప్పినప్పుడు 'మట్టి పెళ్ళ నీటిలో వేసినప్పుడు ఎలా కరిగిపోతుందో!' అలాగే, వీళ్ళు కూడా వారు చెప్పిన వాటిని అర్థం చేసుకొని వెంటనే వారి అలవాట్లు మార్చుకుంటారు.

మానవులలో ఇలాంటి వాళ్లుకూడా ఉంటారు. నావరకు నేను ఈ ధ్యానమార్గంలోకి వచ్చినప్పుడు, పత్రి గారు మా ధ్యాన మందిరానికి వచ్చారు.

నేను ఆ ధ్యాన మందిరంలో గోడల మీద ఒక ప్రక్క స్త్రీలు, ఇంకొక ప్రక్క పురుషులు, అని పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాయించాను. అంటే స్త్రీలు

కూర్చునే ప్రదేశం, అలాగే పురుషులు కూర్చునే ప్రదేశం అన్నట్టుగా వ్రాయించాను.

పత్రి గారు అది చూసి నవ్వుకున్నారు, రైల్వేస్టేషన్లో లేవట్రీలలో వ్రాస్తారు, స్త్రీలు, పురుషులు అని. అవి తీసేసి అటు ప్రక్క "అహం బ్రహ్మోస్మి" అని వ్రాయి, ఇటుప్రక్క "తత్వమసి" అని వ్రాయి అని చెప్పారు. ఆయన చెప్పింది నాకు బాగా అర్థం అయింది. వెంటనే మార్చి వ్రాయించాను.

అలాగే మందిరం బైట మన సొసైటీ ఎంబ్లెమ్ వేయించమన్నారు. ఏ మందిరంలోనైనా ఇలాంటి మార్పులు చేయమంటే ఒప్పుకోరు. కానీ ఆయన చెప్పింది నాకు అర్థమయింది. వెంటనే ఆ మార్పు కూడా చేశాను.

అప్పుడు నాది మట్టి పెళ్ళ సంస్కారం అని అర్థమైంది అంటే పెద్దలు సత్యం చెప్పినప్పుడు, అది అర్థం చేసుకొని వెంటనే మార్పు చేసుకోవడమే మట్టిపెళ్ళ సంస్కారం అంటారు.

అలాగే ఆయన 18 ఆదర్శ సూత్రాలలో "విగ్రహారాధన వద్దు, సత్యారాధనే చెయ్యాలి" అన్నారు. కానీ నేను వెంకటేశ్వర స్వామికి వీరభక్తుడిని, ప్రత్యేక మందిరమే కట్టించాను.

మొదట్లో పత్రిగారు మూడు రోజుల యజ్ఞం పెట్టించారు. అప్పుడు మొదటి రోజు శనివారం వచ్చింది. పత్రి గారు వచ్చిన వారందరి చేతా ధ్యానం చేయిస్తున్నారు. కాని ఆరోజు శనివారం కావడం వల్ల మా అలవాటు ప్రకారం మేమిద్దరం మందిరంలో పూజ చేయించుకున్నాము. పూజ అయిన తర్వాత, గదిలోకి వచ్చి కూర్చున్నాము.

మేము గదిలో రావటం గమనించి, స్టేజి మీద ఉన్న పత్రి గారు, ధ్యానం చేయించే వాళ్ళని వదిలేసి, మేమున్న గదిలోకి వచ్చారు. కొంచెం సీరియస్ గానే మమ్మల్ని ఎక్కడికి వెళ్లారు? అని అడిగారు.

ప్రతి వారం పూజ చేయించే అలవాటు వుంది, అందుచేత పూజ చేయించుకున్నాం అని చెప్పాము. అప్పుడు ఆయన పూజ ఎందుకు చేశారు?

అని అడిగారు. ఆయన అలా అడగడానికి కారణం బయట ధ్యానం జరుగుతుంటే మేము మందిరంలో పూజ చేయించాము కాబట్టి.

మాకు ఏం చెప్పాలో అర్థంకాక, ఆ పూజ చేయించడం వల్లనే మీలాంటి వారి పరిచయం కలిగిందేమో అని అన్నాను. అప్పుడు ఆయన  నువ్వు పూజ చేయడం వల్లే నాలాంటి వాళ్ళ పరిచయం ఇంత లేట్ అయింది అని అన్నారు. నేనేదో లాభం లెక్కలో చెప్పుకొస్తే ఆయన అది నాకు నష్టం కలిగించింది అని చెప్పారు.

ఆ సంఘటన జరిగిన తర్వాత  నేను భగవద్గీత, ఉపనిషత్తులు, పురాణాలు చదవడం జరిగింది. పత్రి గారి వీడియోలు కూడా వినడం జరిగింది. అప్పుడు పత్రిగారు చెప్పింది సత్యం అని తెలుసుకున్నాను.

అంతేకాదు స్వామి దయానంద సరస్వతి గారి ' సత్యార్థ ప్రకాశం ' అనే పుస్తకం చదివినప్పుడు  "పూజ మెట్టు కాదు అగడ్త" అని ఆయన చెప్పిన మాటలు, పత్రీజీ చెప్పిన మాటలు సరిపోయాయి. 'మెట్టు అంటే పైకెక్కినవాడు అంటే లాభం పొందినట్టు,  అగడ్త అంటే గోతిలో పడ్డవాడు నష్టపోయినట్టు' అని తెలుసుకున్నాను.

అప్పుడు పత్రిగారు పూజ ఎందుకు వద్దంటున్నారు? ఏమిటి దాంట్లో నష్టం? ధ్యానమే ఎందుకు చేయమంటున్నారు? ఏమిటి ఇందులో లాభం? అన్న దాని మీద కొంత స్టడీ చేశాను.

సహజంగా నేను మందిరంలో కూర్చొని వున్నప్పుడు "అన్నమాచార్య కీర్తనలు" వినే వాడిని. ఒకరోజు

" బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే" అన్న పాటలో  "హీనాధికములు ఎందులేవు, అందరికీ శ్రీహరే అంతరాత్మ" అన్న చరణం వినడం జరిగింది. దాని అర్థం కూడా అర్థమైంది.

అంటే   ఈ ప్రపంచంలో "హీనమైనది", "అధికమైనది" అంటూ ఏదీ లేదు అంటే "హీనమైనవాడు, అధికమైన వాడు" అంటూ ఎవరూ లేరు.

అంటే "హీనమైన జీవి, అధికమైన జీవి" అంటూ ఏదీ లేదు. దానికి ముఖ్య కారణం "అందరికీ ఆ శ్రీహరే అంతరాత్మ కాబట్టి". అని ఆ పాట యొక్క అర్థం తెలుసుకున్నాను.

శ్రీహరి అంటే వెంకటేశ్వరస్వామే కదా? ఆయన ప్రతి ఒక్కరి అంతరంలో 'ఆత్మ'గా ఉన్నాడు అని అర్థమైంది.

అప్పుడు తెలుసుకున్నాను, ఇన్నాళ్లు ఆ వెంకటేశ్వర స్వామి తిరుమలలో ఉన్నాడని అక్కడికి వెళ్లే వాడిని. కాని నిజంగా ఆ వెంకటేశ్వర స్వామి, ఈ శరీరరంలోనే ఉన్నాడు అని అర్థం అయింది.

అందుకే పత్రి గారు "విగ్రహారాధన వద్దు, సత్యము అంటే ఆత్మనే ఆరాధించమన్నారు". కారణం "ఆత్మే సత్యము" "ఆత్మే భగవంతుడు" కాబట్టి.

అప్పటివరకు పూజలు వదలటానికి భయపడ్డాను, ఏమైనా తప్పు చేస్తున్నానా? అని. ఎందుచేతనంటే చిన్నప్పటినుండి అంటే 50 సంవత్సరాల నుండి అదే అలవాటు అయ్యింది. ఎవరికైనా ఏదైనా అలవాటు అయితే ఆ అలవాటు మార్చుకోవటం చాలా కష్టం.

జన్మజన్మల నుండి వచ్చిన ఈ సంస్కారం ఒక్కసారితో ఎలా పోతుంది? కానీ, అంతటి బ్రహ్మర్షి పత్రి గారు చెప్పడం వల్ల, ఆ సంస్కారాన్ని నేను మార్చుకున్నాను.

అప్పుడు తిరుమల వెళ్తే అక్కడ ఉండేది విగ్రహము, కాని శరీరంలోకి వెళ్తే సత్యమైన వెంకటేశ్వర స్వామి దగ్గరకు వెళ్ళినట్టు అని అర్థమయింది.

తిరుపతి వెళ్తే సంవత్సరంలో ఒకటి రెండు సార్లు వెళ్లేవాడిని. వెళ్లినా కూడా ఒక్క నిమిషం కూడా చూడనిచ్చేవారు కాదు.

కానీ, ధ్యానం చేసినప్పుడు సాక్షాత్తు సత్యమైన ఆత్మతో అంటే ఆ వెంకటేశ్వర స్వామితో గంటలు గంటలు కూర్చునేవాడిని.

ఆలా ధ్యానంలో కూర్చున్నప్పుడు అంతులేని ఆనందం కలిగేది, శక్తి పెరిగేది, నాలో ఎన్నో మార్పులు వచ్చాయి.

అందుచేత  పత్రి గారు చెప్పింది బాగా అర్థం చేసుకుని వెంటనే నేను నా అలవాటు మార్చుకోగలిగాను. ఇప్పుడు అర్థమవుతుంది నాలో ఉన్నది 'మట్టి పెళ్ళ సంస్కారం' అని. అంతకుముందు భయపడే వాడిని, కాని ఇప్పుడు ఆ భయము లేదు.

అలాగే మన రవి మాంసాహారం బాగా తినేవాడు. నా పరిచయం అయ్యాక మాంసం తినకూడదు, అది రజోగుణం పెంచుతుంది, మన చేత చెయ్యకూడని పనులు చేయిస్తుంది అని చెప్పడం జరిగింది. అంతేకాదు ఒక జీవిని చంపటం సృష్టి విరుద్ధం, ఆ పాపం మనం అనుభవించవలసి వస్తుంది అని చెప్పినప్పుడు అర్థం చేసుకున్నాడు.

తనకు కొన్ని రోగాలు ఉన్నాయి! మాంసాహారం వల్లనే  ఈ రోగాలు వచ్చాయి అని అర్థం చేసుకొని, వెంటనే మార్పు చేసుకున్నాడు.

ఆలా  చాలా విషయాల్లో మార్పులు వచ్చాయి. భార్యతో వ్యవహరించే తీరు, ఆఫీసులో ఇతర స్టాఫ్, హయ్యర్ అఫీషియల్స్ తో ప్రవర్తించే తీరు ఇలా చాలా విషయాల్లో మార్పు వచ్చింది.

దీనిని బట్టి రవిది మట్టి పెళ్ళ సంస్కారము అని చెప్పవచ్చు. ఈ మట్టి పెళ్ళ సంస్కారం ఉన్నవాళ్లు చాలా గొప్పగా ఎదుగుతారు.

పెద్దలు చెప్పినప్పుడు దాని అర్థం చేసుకొని, ఆ రకమైన మార్పు వారిలో తెచ్చుకోగలిగితే, ఆ మట్టి పెళ్ళ నీళ్లల్లో కరిగిపోయినట్టు వారిలో వున్న అలవాట్లు కూడా మారిపోతాయి.

చాలామంది ఈ విషయాలు చెప్పగానే  మారిపోయారు. ఈ విగ్రహారాధన విషయంలో, మాంసాహార విషయంలో చాలా మంది మారారు. కారణం వారందరిలో  మట్టి పెళ్ళ సంస్కారాలు ఉన్నాయి కాబట్టి.

**2) కట్టె సంస్కారాలు :-** చాలా మంది విగ్రహారాధన మాన లేకపోవటానికి ఆరు కారణాలు ఉన్నాయి. అందులో మొట్టమొదటిది "సంస్కారాలు" అంటే చిన్ననాటి నుండి అయిన అలవాటు. అందుచేత గమ్మున మానరు, చెబితే

కరెక్టే అంటారు, ఒప్పుకుంటారు కాని మార్పు రాదు.

ఒకావిడ విగ్రహారాధన గురించి అడిగినప్పుడు చెప్పాను. ముందు "దేవుడు ఎవరో తెలుసుకో" "ఆయన ఎక్కడ ఉంటాడో తెలుసుకో" అయనను "ఎలా ఆశ్రయించాలో తెలుసుకో" తరువాత నువ్వు ఏం చేయదలుచుకుంటే అది చేసుకో అన్నాను.

ఆవిడను అడిగితే ఆత్మే భగవంతుడు అని చెబుతుంది. ఆత్మ అందరి శరీరాల్లోనూ ఉంది అని చెబుతుంది. కాని గుడికి వెళ్తుంది. అంటే ఆమెకు అన్ని తెలిసినా! అలవాటు వదలలేకపోతోంది.

అంటే ఈమెది కట్టె సంస్కారం. కారణం ఈమె మెల్లిగా మారుతుంది. ఆవిడ క్లాసులు ఇంకా వినాలి. మట్టి పెళ్ళ సంస్కారం ఉన్నవాళ్లు మనం చెప్పే క్లాసులు విని వెంటనే వాళ్ళల్లో మార్పు తెచ్చుకుంటారు. కాని కట్టె సంస్కారం ఉన్నవాళ్లు, ఈ జూమ్ క్లాసులు, భీమవరం క్లాసులు, కొన్ని నెలలు వింటే నెమ్మదిగా మారతారు.

ఈ జూమ్ క్లాసులు, భీమవరం క్లాసులకు వచ్చిన వారు అర్థం చేసుకుని మెల్లిగా మార్పు తెచ్చుకుంటారు. వాళ్ళది "కట్టె సంస్కారం" అని చెప్పవచ్చు. కానీ చెప్పిన వెంటనే మారిన వారిది "మట్టిపెళ్ళ సంస్కారం" అని చెప్పవచ్చు.

ఎవరికైనా ధ్యానం చేయటంతో బుద్ధి బాగా వికసిస్తుంది. వాళ్ళు చెప్పినవి అర్థం చేసుకుంటూ, సత్యంలో జీవిస్తారు. వాళ్ళకు ఆటోమేటిక్‌గా ఆచరణలోకి వస్తుంది.

అందుచేత ఈ సంస్కారాలు అంత తొందరగా పోవు. సంస్కారాలు మంచివైతే ఏ ఇబ్బంది లేదు. "మనకు నష్టం కలిగించేటట్లు ఉంటే", "మన ఎదుగుదలకు ఆటంకం కలిగించేటట్లు ఉంటే", "మన దుఃఖ నివారణకు ఇబ్బందిగా ఉంటే" ఆ అలవాట్లు మార్చుకోవాల్సిందే? దానికి బుద్ధి బాగా వికసింప చేసుకోవాలి. దానికి తీవ్ర ధ్యాన సాధన చేయాలి.

మానవుడు చనిపోయినప్పుడు "కూడా వచ్చేవి" ఏమిటి అన్న దాని మీద మనం చెప్పుకుంటున్నాము. ఎందుచేతనంటే మానవుడు జీవిస్తున్నప్పుడు భూమ్మీద ఎన్నో సంపాదించుకుంటాడు. ధనాన్ని సంపాదిస్తాడు, ఆస్తులు సంపాదిస్తాడు, భూములు సంపాదిస్తాడు, పదవులు సంపాదిస్తాడు, ఉద్యోగాలు సంపాదిస్తాడు, బంగారం సంపాదిస్తాడు. అలా ఎన్నెన్నో సంపాదించుకుంటాడు.

ఇంకా  భార్యని, భర్తని, పిల్లల్ని, మనవళ్లను, ఇంకొంతమంది ముని మనవళ్ళని, స్నేహితుల్ని, బంధువుల్ని ఇలా ఎంతోమందిని సంపాదించు కుంటాడు.

కానీ, చనిపోయినప్పుడు అంటే మరణించి వెళ్లిపోయేటప్పుడు వేటిని తీసుకు వెళ్ళలేడు,  అన్నీ ఇక్కడే వదిలి వేయవలసి వస్తుంది. కాని ఉన్నప్పుడు మాత్రం వాటన్నిటినీ "నావి" అని అంటాడు,  ఉన్నవాళ్లంతా "నా వాళ్లు" అని అంటాడు, లేదంటే "మావి" అని అంటాడు. ఈ విధంగా "నావి అన్నవి", "నా వాళ్లు అన్న వాళ్లు" ఎవ్వరూ కూడా రారు. అయినా సరే జీవితం అంతా అలా సంపాదించు కుంటూనే ఉంటాడు. అలా ఎంతోమందిని పెంచుకుంటూ ఉంటాడు. కానీ, ఒక్కటీ రాదు, ఒక్కరూ రారు. మరి ఏమి వస్తాయి? అంటే మనం చెప్పుకున్న 4 వస్తాయి.

కాని తెలివైనవాడు రాని వాటికి అంత ప్రాముఖ్యం ఇవ్వడు. అలాంటి వారే యోగులు. వారి నుంచి మనం నేర్చుకోవాలి. ఒక రమణ మహర్షి, వివేకానంద, లాంటి వారి నుంచి నేర్చుకోవచ్చు. వాళ్లను చూస్తే మనకి అర్థమవుతుంది, "కూడా రాని వాటికి" వాళ్లు అసలు ప్రాముఖ్యం ఇవ్వలేదు.

కానీ, వాళ్ళ దృష్టినంతా "కూడా వచ్చే వాటి" మీదే పెట్టారు. అందుచేత "కూడా వచ్చే వాటిలో" ఏవి తనకు లాభిస్తాయి? ఏవి తనకు నష్టం కలిగిస్తాయి? వాటిలో ఎటువంటి వాటి మీద దృష్టి పెట్టాలి? అన్నవి తెలుసుకోగలిగినవాడు అదృష్టవంతుడు.

ఇవన్నీ తెలుసుకుని ఏవైతే తనకి బాగా లాభిస్తాయో! అవి సంపాదించు

కున్నవాడు చాలా అదృష్టవంతుడు. అంతేకానీ, ఏ ఆలోచన లేకుండా, ఎలా పడితే అలా జీవిస్తే ఆ జీవితంలో నష్టపోవడమే కాదు, తర్వాత కష్టాల పాలవుతారు, ఎన్నో బాధలు అనుభవిస్తారు.

అందుచేత, కూడా వచ్చే వాటి గురించి  తెలుసుకోవాలి. చాలా మంది ఏముంది అని అనుకుంటారు. కానీ, దాంట్లోనే సమస్తము ఉంది. ఎందుచేతంటే? మరణిస్తే అక్కడితో జీవితం ఆఖరు కాదు.

పత్రి గారు స్పష్టంగా చెప్పారు, మరణం అంటే "ఉన్న ప్రదేశాన్ని, ఉన్న శరీరాన్ని" మార్చడం. అంతే కానీ, లేకుండా పోవడం కాదు అన్నారు. అందుచేత మరణించేది శరీరమే. మరి ఉండేది  ఏది అంటే 'ఆత్మ'.  'ఆత్మ' అంటే మనమే. ఆ ఆత్మ శరీరంలో ప్రవేశిస్తే జననము అని అంటాము. ఆ ఆత్మ శరీరంలో నుంచి బయటికి వస్తే మరణము అంటాము.

అందుచేత 'ఆత్మ' అయిన మనము జన్మించినప్పుడు ఒక శరీరం తీసుకుంటాము. తీసుకొని ఆ జన్మలో ఆ శరీరంతో ఎన్నో సంపాదించుకొని, సమకూర్చుకొని, ఎన్నో పొంది, ఎన్నెన్నో చేసి, మరల ఆ శరీరం వదిలేస్తాము.

గమనిస్తే, మనం వచ్చినప్పుడు ఒట్టి చేతులతో వస్తాము. మరణించి నప్పుడు అంటే చనిపోయినప్పుడు ఒట్టి చేతులతో వెళ్ళిపోతాము అంటే ఖాళీ చేతులతో వెళ్లిపోతాము. అంతేకాని చేతులతో పట్టుకెళ్ళేవి ఏమీ లేవు. కారణం శరీరం లేనప్పుడు చేతులు ఉండవు ఎలా పట్టుకు వెళతారు?

కానీ కనపడనివి పట్టుకెళ్తారు. కానీ, మానవులందరూ కనపడే వాటి మీద దృష్టి పెడతారు,  వాటికే ప్రాముఖ్యం ఇస్తూ అవే తమవని అనుకుంటారు, అవే శాశ్వతం అనుకుంటారు, వాటిని చూసిమురిసిపోతారు, పొంగిపోతారు, గర్వపడతారు, అహంకరిస్తారు కూడా.  కానీ అవన్నీ ఉండనివి, తన కూడా రావన్న విషయం తెలియదు.

అంతేకాదు, అలా తాము సంపాదించుకున్నది ఏదైనా కోల్పోయినా, నష్టపోయినా ఎంతో బాధపడతారు. ఈ కనిపించేవి ఏవి కూడా వచ్చేవి కావు,

పోతే పోతాయి అని అనుకోరు. తాను ఏదో చాలా నష్టపోయాను అని భావిస్తారు, ఎంతో విచారిస్తారు. కూడా రానివి ఇతరుల దగ్గర ఉంటే చూసి అసూయ పడతారు, వాడు ఎంత అదృష్టవంతుడు అని అనుకుంటారు. నేను ఎంత దురదృష్టవంతుడిని అని అనుకుంటారు.

నిజంగా అవి ఏవి తన కూడా రావు అని తెలుసుకోగలిగితే అలా వున్నవాడి మీద జాలి పడతారు. పిచ్చోడు రాని వాటిని చూసుకొని మురిసి పోతున్నాడు అని భావిస్తారు. ఇది తెలుసుకుంటే వారి మీద అసూయపడరు, జాలి పడతారు. తనకి లేదని బాధపడరు, నాకెందుకు రానివన్నీ అని అనుకుంటారు. ఇది జ్ఞానం వున్న వారికి అర్థం అవుతుంది. వారిలో ఏ మాత్రం జ్ఞానం ఉన్న తెలుస్తుంది.

జ్ఞానం అంటే "నేను దేహం కాదు", "నేను ఆత్మను" అని తెలుసుకోవడం.

ఇది ఎవరైతే తెలుసుకుంటారో, ఈ జ్ఞానం ఎవరికైతే ఉంటుందో, వారు వెళ్లిపోయేటప్పుడు అంటే చనిపోయినప్పుడు, ఉండిపోయే వాటికి, వదిలి వేసే వాటికి ప్రాముఖ్యం ఇవ్వరు. "కూడా వచ్చే వాటికే" ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు.

రమణ మహర్షి జీవితం చూస్తే మనకి అర్థమవుతుంది. భోగభాగ్యాల మీద ఆయనకు దృష్టి ఉండేది కాదు. సంపదలు, బంగారం లాంటి వాటిమీద ఆయనకు దృష్టి ఉండేది కాదు. గోచితోటే ఉండేవారు ఆయన పూటకి ఏది వుంటే అదే తినేవారు.

ఆయనను చూడటానికి శిష్యులు, భక్తులు ఎంతోమంది వచ్చేవారు. ఒకసారి ఒక దొంగ అనుకున్నాడు, ఇంత మంది వస్తున్నారు, ఈయనకి ఎన్ని బహుమతులు వస్తాయో! ఈయన దగ్గర ఎన్ని ఉన్నాయో! అనుకుంటూ ఒక రాత్రి అవన్నీ దోచుకోవడానికి మెల్లిగా ఆయన ఆశ్రమంలో దూరాడు, ఆయన ఉండే హాల్లోకి వెళ్ళాడు. రమణ మహర్షి వాడిని చూశారు. చూసి వాడితో ఏమన్నారంటే, ఒరే నాయనా! నా దగ్గర ఉన్న వాటిని దోచుకోవడానికి వచ్చినట్టున్నావు! నువ్వు ఒక పని చెయ్యి, ఇక్కడ నేను ఉంటే నువ్వు తీసుకు

వెళ్ళటానికి, భయపడతావు, మొహమాట పడతావు, నేను బయటికి వెళ్లిపోతాను, నీకు కావాల్సినవన్నీ మూట కట్టుకొని వెళ్ళిపో. నువ్వు వెళ్ళాక, నేను మరలా వస్తాను అని అన్నారు.

వాడికి మతి లేదు. ఏమిటి ఇలా అన్నారు అని లోపలికి వెళ్ళాక వాడికి అర్థమయింది, ఆయన దగ్గర ఏమీ లేదు అని. అప్పుడు ఆ దొంగ ఆయన కాళ్ళ మీద పడి, వెళ్ళిపోవటం జరిగింది.

దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు ఆయన "కూడా రాని వాటికి" ప్రాముఖ్యం ఇచ్చేవారు కాదని. నిజంగా మనం తెలివైన వాళ్ళమే అయితే మనం కూడా రాని వాటి గురించి ఆలోచించము.

అందుచేత ఏదైతే మనకి ఇవ్వబడిందో, ఎంతయితే ఉందో, అంతమటుకే ప్రకృతిచే మనకు ఇవ్వబడింది అని తెలుసుకోండి. గతంలో మనం పొందిన అర్హతను బట్టే మనకు ఇవ్వబడింది అని తెలుసుకోవాలి. ఉన్నదానితో తృప్తిగా జీవించాలి. అలా జీవించే వారు ఎప్పుడూ ఆనందంగా ఉంటారు. వీలైతే ఎంత తక్కువ ఉన్నా, తక్కువలో తక్కువ, లోక కళ్యాణం కోసం కొంత ఖర్చు పెట్టగలిగితే ఆ ఫలితమే కూడా వస్తుంది. అంతేకానీ భూమి మీద ఎంత పోగేసినా 'కూడా రాదు' ఇది జ్ఞానులకి అర్థం అవుతుంది.

అందుచేత కూడా వాసనలు వస్తాయి, సంస్కారాలు వస్తాయి, కర్మలు వస్తాయి, సంపాదించుకున్న జ్ఞానం వస్తుందని తెలుసుకోవాలి.

తెలుసుకోండి ధనము ఉన్నవాడు గొప్పవాడు కాదు, పదవి ఉన్నవాడు గొప్పవాడు కాదు, గొప్ప గొప్ప ఉద్యోగాల్లో ఉన్న వాళ్ళు గొప్ప వాళ్ళు కాదు. కారణం అవి ఏవీ శాశ్వతం కాదు. నీ ఉద్యోగం ఎప్పుడో ఒకప్పుడు పోతుంది, రిటైర్ అవ్వాల్సిందే! పదవులు ఉన్న వారిని చూస్తున్నాము, ఎవరు శాశ్వతంగా వున్నారు? అలాగే ధనం ఎప్పుడు వస్తుందో తెలియదు, ఎప్పుడు పోతుందో తెలియదు.

మనం చూశాం కదా! అనిల్ అంబానీ ఒకప్పుడు, అపర కోటీశ్వరుడే.

పరిస్థితుల ప్రభావం వల్ల తన ఆస్తులు మొత్తం కోల్పోవలసి వచ్చింది. ఎవరైనా అంతే. అందుచేత, జ్ఞానులు ఉండని వాటికి ప్రాముఖ్యం ఇవ్వరు.

ఆత్మలమైన మనం ఆత్మ లాభం కోసమే కృషి చేయాలి, ఆత్మ ఉన్నతి కోసమే ప్రయత్నించాలి. ఎందుచేతనంటే ఈ శరీరం కొన్నాళ్లే ఉంటుంది. శరీరం వదిలాక ఆత్మ అంటే మనం మన స్వలోకమైన ఆ పరలోకం వెళ్ళిపోతాము. అదే మనకు శాశ్వతమైనది, మనకి ఉన్నతి అక్కడ కలగాలి.

అందుకే పెద్దలు నువ్వు భూమ్మీద ఉన్నప్పుడు ఆత్మ అన్నట్టుగా జీవించు, ఆత్మకు లాభం కలిగించే పనులు చెయ్యి అంటారు. అప్పుడు నువ్వు గొప్పవాడివి అవుతావు. అలా గొప్పగా అయిన వారే రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, యోగి వేమన, వీరబ్రహ్మేంద్రస్వామి, బుద్ధుడు, జీసస్ లాంటి వారంతా. ఇంకా రాముడు, ఆంజనేయస్వామి ఇలా ఎంతో మంది వున్నారు. మన పత్రి గారు, షిరిడి బాబా, మెహర్ బాబా, సత్య సాయిబాబా లాంటి వాళ్లు ఎంతో ఎదిగారు. వారంతా వారి అనుభవంతో ఎన్నో విషయాలు లోకానికి బోధించారు.

నేను దేహమన్నట్టుగా జీవించే వారు ''జీవించే విధానం'', "వాళ్ళు చేసే పనులు", "వారి ప్రాముఖ్యతలు" వేరే ఉంటాయి. కానీ, ఆత్మ నేను అన్నట్టుగా జీవించే "వాళ్ళ జీవితము", "వాళ్ళ పనులు", వాళ్ళ ఆలోచనా విధానము ఇంకొకరకంగా ఉంటాయి.

"నేను ఆత్మ" అని జీవించే వాళ్ళు చెప్పేవి, చేసేవి, ఈ దేహమే నేను అనుకునే వారికి అర్థం కాదు. ఈ దేహం నేను అనుకునే వారు "ఆత్మ దేవుడు" అయితే "విగ్రహం" దేవుడు అనుకుంటారు. అన్ని జీవులు అన్ని ప్రాణులు ఒక్కటే అని అంటే, కోడి వేరు, నేను మానవుడిని అని అంటారు.

అంతేకాదు వాటిని చంపకూడదు, వాటి మాంసం తినకూడదు, నువ్వు ఎదగవు, ఇంకా పతనం అవుతావు అని చెప్పితే అర్థం కాదు.

కాని జ్ఞానం ఉన్నవారు అలాంటి గొప్ప వాళ్ళ మాటలు విని ఆచరించే

ప్రయత్నం చేస్తారు. ఎవరు అయితే ఈ జూమ్ లోకి వచ్చారో, ఎవరైతే భీమవరం మూడు రోజుల క్లాస్ కి వస్తున్నారో, వాళ్లంతా ఆ స్థాయిలో ఉన్నవాళ్లే. ఇన్ని కోట్ల మందిలో కొద్ది మంది మాత్రమే వీళ్ళు.

వీళ్లది మట్టి పెళ్ళ సంస్కారం. వీళ్లు పెద్దలు చెప్పిన వెంటనే మారిపోతారు. అలాగే వీరు మాంసం గురించి చెప్పగానే మానేస్తారు.

కాని 'కట్టె సంస్కారం' ఉన్నవాళ్లు, ఏంత చెప్పినా మా నాన్న తింటున్నాడు, మా తాత తిన్నాడు, మా కుటుంబంలో అంతా తింటారు అని రకరకాలుగా ప్రశ్నిస్తూ వుంటారు. ఇంకా ఏమంటారంటే మాంసం తినటం పాపమైతే, మీరు కూరగాయలు తింటున్నారు? వాటిల్లో కూడా ప్రాణం ఉందికదా? లాంటి ఎన్నో ప్రశ్నలు వేస్తారు.

ఆలాంటి సందేహాలు ఒక్కొక్కటి క్లియర్ అవుతే, ఎప్పటికో అర్థం చేసుకొని, మెల్లిగా మార్పు తెచ్చుకుంటారు.

అందుకే పత్రి గారు జ్ఞానుల యొక్క సాంగత్యం చెయ్యమంటారు.

**3) బండ సంస్కారం :–** ఇంకా కొంతమంది ఉంటారు. వారిది 'బండ సంస్కారం' వాళ్లు ఎంత చెప్పినా వినరు. అలాంటి వారిని ఆ గురువులు వీడికి చెప్పినా లాభం లేదు అని వదిలేస్తారు. ఎవరైతే అర్థం చేసుకుంటారో! వాళ్లకే చెప్పటానికి ప్రయత్నిస్తారు.

అందుచేత, బండ ఎన్నాళ్ళు నీళ్లలో ఉంచినా, యుగాలు గడిచిన మెత్త పడదు. అలాంటి వాళ్ళే వీళ్లంతా. వీరు ప్రారంభ జన్మల్లో ఉన్నవాళ్లు. వీళ్ళకి ఈ అలవాట్లు పోవాలంటే ఎన్నో జన్మలు పడుతుంది.

కనీసం 'కట్టె సంస్కారం' ఉన్నవాళ్లు కొన్ని సంవత్సరాల కైనా మారుతారు.

అందుచేత, ఈ కూడా వచ్చే వాటిలో ఎలాంటి అలవాట్లు చేసుకోవాలి? ఎలాంటి అలవాట్లు మనకు లాభిస్తాయి? మన భవిష్యత్తును తీర్చుదిద్దుతాయి? అసలు ఆత్మ ఉన్నతికి లాభించే అలవాట్లు ఏమిటి? అన్నవి తెలుసుకుని అటువంటి అలవాట్లు చేసుకోవాలి, వాడు తెలివైనవాడు.

అందుచేత ఆ గురువులు చెప్పింది అర్థం చేసుకుని, “కూడా వచ్చే వాటికి” ప్రాముఖ్యం ఇవ్వాలి. ఇది ఇప్పుడు తెలియదు భవిష్యత్తులో తెలుస్తుంది.

కూడా వచ్చే వాటికి ప్రాముఖ్యం ఇస్తే, మరుజన్మ ఎంత గొప్పగా వుంటుందో! వారు ఎంత అదృష్టవంతులో అన్నది తెలుసుకోవాలి. వారు పరలోకాలకు వెళ్ళినా కూడా గొప్ప ఆదరణ ఉంటుంది, గొప్ప సాంగత్యం దొరుకుతుంది. అందుచేత కూడా వచ్చే వాటికి ప్రాముఖ్యం ఇద్దాం.

మానవుడు చనిపోయాక ...కూడా వచ్చే వాటి మీద ఎంత అవగాహన ఉంటే వారి భవిష్యత్తు జన్మ అంత బాగా తీర్చిదిద్దుకుంటారు.

చాలామంది చనిపోతే ఇక జీవితం ఆఖరు అని అనుకుంటారు, అది పొరపాటు. ఎందుచేతనంటే? మీరు దేహమైతే అక్కడితో జీవితం ఆఖరు. కానీ అందరూ ఆత్మలే. అందుచేత, కచ్చితంగా భవిష్యత్తు ఉంది. ఈ భవిష్యత్తు మూడు రకాలు.

1. ఈ జన్మలో ఉండే భవిష్యత్తు.

2. చనిపోయిన తర్వాత పరలోకంలో ఉండేటువంటి జీవితం ఇంకో భవిష్యత్తు.

3. మరల ఇంకో శరీరం తీసుకున్నప్పుడు అంటే ఇంకొక జన్మలో ప్రవేశించినప్పుడు అది ఇంకో భవిష్యత్తు.

ఈ అన్నిరకాల భవిష్యత్తు బావుండాలి అంటే మానవుడికి చనిపోయాక ‘కూడా వచ్చే వాటి మీద’, తప్పనిసరిగా అవగాహన ఉండాలి.

అందుచేత ఉండే వాటిమీద కాకుండా.. ‘కూడా వచ్చే వాటి మీద’ దృష్టి పెట్టాలి. ఈ విషయం మీకు ఎంత బాగా అర్థం అవుతే మీరు అంత బాగా ఆచరిస్తారు.

అందుచేత తెలుసుకోవడం ముఖ్యం కాదు, అర్థం చేసుకోవడం ముఖ్యం. తెలుసుకుంటే ప్రయోజనం లేదు, అర్థం చేసుకుంటేనే ఏ లాభం అయినా. ఎందుకంటే అర్థమైన వాడు ఆచరిస్తాడు.

అటువంటి వారికి  భవిష్యత్తులో అద్భుతమైన జన్మ లభిస్తుంది.

చాలామంది ప్రస్తుతం ఉన్న  కొన్ని లోపాలు చూసుకొని ఎంతో బాధపడుతూ ఉంటారు. నాకు ఇలాంటి జన్మ వచ్చిందే! నా పని ఇలా అయిపోయిందే! అని దేవుడిని నిందిస్తారు. వారు ఇంకా ఏమంటారంటే? ఏమిటో దేవుడు  నాకు ఇన్ని కష్టాలు, ఇన్ని సమస్యలు, ఇలాంటి సంసారం, ఇలాంటి పరిస్థితులు ఇచ్చాడు అని బాధపడవలసిన పని లేదు. కూడా వచ్చే వాటి మీద అవగాహన ఉంటే! ఏ ఇబ్బందులు లేని, ఏ సమస్యలు లేని భవిష్యత్తు జీవితం మీకు లభిస్తుంది.

అందుచేత ఏది సాధించాలన్నా...ఏది సరి చేసుకోవాలన్నా... ఇప్పుడు వున్న జీవితంలోనే సరిచేసుకోవాలి. ఈ జన్మలో ఏమీ చేయకుండా, తరువాత ఏం చేయగలరు? ఏం మార్చుకోగలరు?

మనం ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాం అంటే జ్ఞానమార్గంలోకి వచ్చాం. అందుచేత అన్నిటి మీద అవగాహన ఉండాలి. ఎవరైతే బుద్ధి స్థితిలో, ఆత్మ స్థితిలో ఉంటారో వాళ్లే వీటన్నిటిమీద అవగాహన చేసుకోగలుగుతారు. అందుచేత 'చనిపోయాక కూడా వచ్చే కర్మల మీద కూడా అవగాహన చేసుకుందాం.'

# కర్మలు

కర్మలు అంటే ఏమిటి? అవి ఎన్నిరకాలు?

ఎటువంటి కర్మలకు ప్రాముఖ్యం ఇవ్వాలి? ఎటువంటి కర్మలు మనం చెయ్యాలి? అన్న విషయాలు తెలుసుకుందాం.

ముఖ్యంగా కర్మలు మూడు రకాలు.

అవి 1. వర్తమాన కర్మలు, 2. సంచిత కర్మలు, 3. ప్రారబ్ద కర్మలు.

'వర్తమాన కర్మలు' అంటే, ప్రస్తుతం మనం చేస్తున్నటువంటి కర్మలు. వాటినే ఆగామి కర్మలు అని కూడా అంటారు.

మనం ఉదయం లేచినప్పటి నుంచి, రాత్రి పడుకునే వరకు ఎన్నో పనులు చేస్తుంటాం. పనులే కాదు, మాటలు కూడా మాట్లాడుతూ ఉంటాం. అందుచేత మనం చేసే పనులు, మాటలు కూడా కర్మల క్రిందకే వస్తాయి.

ఈ జన్మలో చేసిన కర్మల్లో 60 శాతం ఈ జన్మలోనే అనుభవిస్తాము. అనుభవించగా మిగిలిన కర్మలు దేహం వదిలాక ప్రతి ఒక్కరికి, వారి ఖాతాలో పడతాయి. వాటినే 'సంచిత కర్మలు' అంటారు.

శాస్త్రాలలో "చిత్రగుప్తుడి చిట్టా" అని అంటారు. మన సొసైటీలో "ఆకాసిక్ రికార్డ్స్" అని మనం చెప్పుకుంటాము. మరల కొత్తగా జన్మ తీసుకునేటప్పుడు, ఈ 'సంచితం' నుంచి కొన్ని కర్మలు ఎంచుకుంటాము. అలా ఏ కర్మలు అయితే మనం ఎంచుకుంటామో ఆ కర్మలని 'ప్రారబ్ద కర్మలు' అంటారు.

ఆలా తెచ్చుకున్న "ప్రారబ్ద కర్మలు" కచ్చితంగా అనుభవించి తీరాల్సిందే. అనుభవిస్తాం కూడా, ఎవరైనా సరే తప్పదు. ఈ రకంగా మూడు రకాల కర్మలు ఉంటాయి. ఈ కర్మలను బట్టి మీ భవిష్యత్తు ఉంటుంది. ఈ కర్మల మీద ఏంత అవగాహన ఉంటే మీరు భవిష్యత్తులో అంత లాభం పొందుతారు.

అంతే కాదు ఈ కర్మలు మూడు రకాలుగా చేసేవారు ఉంటారు. అవి

1. పాపకర్మలు. 2. పుణ్యకర్మలు. 3. ముక్తి కర్మలు వీటినే ఆత్మ కర్మలు అని కూడా అంటారు.

గమనిస్తే, కొంతమంది 'పాపకర్మలు' చేస్తారు. కొంతమంది 'పుణ్య కర్మలు' చేస్తారు. చాలా తక్కువ మంది 'ముక్తికర్మలు' చేస్తారు, అంటే 'ఆత్మ కర్మలు' చేస్తారు.

ఒకరకంగా చెప్పాలంటే ఎవరైతే ఇప్పుడు  జూమ్ లోకి వస్తున్నారో! భీమవరం క్లాసులకు వస్తున్నారో! వాళ్లకు ఈ కర్మల మీద, 'కర్మసిద్ధాంతం' మీద అవగాహన ఉంటుంది.

వాళ్లు ఈ 'పాప కర్మలు', 'పుణ్య కర్మలు' కంటే కూడా 'ముక్తి కర్మలకి' ప్రాముఖ్యం ఇస్తారు, 'ముక్తికర్మలే' చేస్తూ ఉంటారు. ఎందుచేతనంటే, ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చిన వాళ్ళకి అవగాహన ఉంటుంది. ఏమని?

"పాపకర్మలు చేస్తే దుఃఖాన్ని కలిగిస్తుంది".

"పుణ్య కర్మలు చేస్తే భోగాన్ని కలిగిస్తాయి". కానీ,

"ముక్తి కర్మలు చేస్తే మోక్షాన్నే కలిగిస్తాయి".

ఈ అవగాహన, ఈ జ్ఞానమార్గంలోకి వచ్చినవాళ్లకి ఉంటుంది. కాని కొత్తగా ధ్యానంలోకి వచ్చిన వాళ్లకు సరైన అవగాహన ఉండదు.

గమనిస్తే, 'పుణ్య కర్మల' వల్ల పెద్ద నష్టం ఏమీ లేదు. కానీ, 'పాప కర్మల' వల్ల ఎన్నో కష్టాలు పడాలి, నరకం అనుభవించాలి. మరి ఈ 'పాప కర్మలు' అధిగమించాలి అంటే 'ముక్తి కర్మలు' చేయాలి. అంటే 'జ్ఞానాన్ని' పెంచుకోవాలి. దానికి, "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయాలి. పత్రి గారు, బోధించిన "శ్వాస మీద ధ్యాస"  తప్ప ఇంక ఏ ధ్యానం చేసినా జ్ఞానం రాదు.

భగవద్గీతలో చెప్పబడింది కదా!  'జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణం'అని, అంటే 'జ్ఞానమనే అగ్నిలోనే' అంతకుముందు చేసిన కర్మలన్నీ దగ్ధమైపోతాయి.

మరి  కర్మలు ఎందుకు దగ్ధం చేసుకోవాలి? అంటే కర్మలన్నీ దగ్ధమవుతే!

మానవులందరూ కోరుకునే మోక్షం అన్నది వస్తుంది, దానినే "దుఃఖరాహిత్య స్థితి" అంటారు, "శాశ్వత ఆనంద స్థితి" అని కూడా అంటారు.

అందుచేత అటువంటి జ్ఞానం "శ్వాస మీద ధ్యాస" ధ్యానం వల్లనే సాధ్యం.

ఈ 'పాపకర్మలు', 'పుణ్య కర్మలు' రెండూ కూడా దేహానికి సంబంధించినవని తెలుసుకోవాలి. కాని 'ముక్తి కర్మలు' ఆత్మకు సంబంధించినవి. అందుచేత వీటి గురించి ఇంకా లోతుగా అధ్యయనం చేద్దాం.

ఇంతకు ముందు కర్మలు మూడు రకాలుగా చేసే వాళ్ళు ఉన్నారని చెప్పుకున్నాం.

కొంతమంది 'పాపకర్మలు' చేస్తారు. కొంతమంది 'పుణ్యకర్మలు' చేస్తారు. చాలా తక్కువ మంది 'ముక్తి కర్మలు' చేస్తారు అంటే 'ఆత్మ కర్మలు' చేస్తారు అని చెప్పుకున్నాం.

ఇంకా లోతుగా ఆలోచిస్తే, ఈ చేసే కర్మల్ని, రెండు రకాలుగా విభజించుకోవచ్చు.

1.దేహ కర్మలు. 2.ఆత్మ కర్మలు.

దేహ లాభాల కోసం చేసే వాటిని 'దేహకర్మలు' అంటారు. 'ఆత్మ లాభం' కోసం చేసే వాటిని 'ఆత్మ కర్మలు' అంటారు.

అలాగే ఈ దేహ కర్మల్లో రెండు రకాలు ఉన్నాయి.

(1) పాపకర్మలు. (2) పుణ్యకర్మలు

అలాగే ఆత్మ కర్మల్లో కూడా రెండు రకాలు ఉన్నాయి.

(1) పాపకర్మలు. (2) పుణ్యకర్మలు

**1) దేహకర్మల్లో పాపకర్మలు:-**

ఇతరులకు, ఇతర ప్రాణుల దేహాలకు నష్టం కలిగించేవి, కష్టం కలిగించేవి, బాధ కలిగించేవి, హింస కలిగించేవి.

పత్రిగారు దేహ పాపకర్మల గురించి చాలా గట్టిగా చెప్పేవారు. ఆయన

జీవహింస, మాంసభక్షణ చెయ్యద్దు అంటారు. ఎందుచేతనంటే దేహ పాపకర్మలు చేసేవాళ్లు భవిష్యత్తులో తన దేహంతో ఆ పాప కర్మ ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. ఇప్పుడు రోగాలు అనుభవించేవారంతా ఇతర జీవులకు, ఇతర ప్రాణులకు హింస చేసినవారే! అందుకే పత్రిగారు ఏ జీవిని హింసించొద్దు అని చెప్పడానికి కారణం.

అలాగే మోసగించినా, కష్టపెట్టినా, నష్టపెట్టినా అదే ఫలితం మరలా అనుభవించవలసి వస్తుంది. అందుచేత కాళ్లు నరికితే యాక్సిడెంట్ లోనో, జబ్బుపడో కాళ్ళు పోగొట్టు కోవల్సి వస్తుంది. అలా ఎటువంటి హింస చేస్తే అలాంటి హింస అనుభవించవలసి వస్తుంది.

ఇంకొక విషయం ఏమిటంటే? ఈ జీవులు అంటే జంతువులు, పక్షులు, క్రిమి కీటకాలు, జలచరాలు అన్నీ సామూహిక ఆత్మలు, కానీ మానవుడు ఏకాత్మ. అందుచేత, ఆ జీవుల పట్ల చేసే హింస కంటే కూడా, సాటి మానవుల పట్ల చేసే హింస చాలా తీవ్రంగా ఉంటుంది.

జంతువులు "సామూహిక ఆత్మలు" కాబట్టి, వాటి ఫలితం అనుభవించడానికి కొంచెం టైం పడుతుంది. కానీ సాటి మానవుడి విషయంలో అలా వుండదు. ఎందుచేతనంటే మానవుడు "ఏకాత్మ". చాలామంది స్త్రీల మీద అత్యాచారం చేస్తూ వుంటారు, అలాగే చాలా మంది భార్యలను బాధించటం చేస్తూ వుంటారు. అలాగే తమ దగ్గర పని చేసే వాళ్ళని బాధించటం. అమాయకుల్ని, తమ క్రింది ఉద్యోగస్తుల్ని, లోకువగా వున్నవారిని బాధించడం చేస్తారు. కానీ, దాని యొక్క తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

అందుచేత, జంతువుల విషయమే కాదు, సాటి మానవుల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే చాలా భాధ అనుభవించాల్సి వస్తుంది.

**2) 'దేహకర్మల్లో పుణ్య కర్మలు' :–** అంటే ఇతరులకు, ఇతర జీవులకు లాభం కలిగించే, ఆనందం కలిగించే పనులు.

ఇతరులకు సేవలు చేసినట్లయితే, దాని ఫలితంగా భోగం అంటే

సుఖం రూపంలో  అనుభవిస్తారు.

సేవ చేయటం అంటే ఇతరులకు లాభం కలిగించే అన్నదానాలు, వస్త్ర దానాలు,  ధనదానాలు, వైద్యసేవలు లాంటివి చెయ్యడం.

ఈ పుణ్య కర్మలు చేయడం వల్ల, మానవుడు భోగం అనుభవిస్తాడు. అంటే ఇతరుల శరీరాలకి లాభం కలిగించాడు కాబట్టి, తన శరీరం లాభం పొందుతుంది. అందుకే పండితులు, పెద్దలు, పాపాలు చేయొద్దు, పుణ్యాలు చేయండి అంటారు.

అలాగే, 'ఆత్మ కర్మల్లో' కూడా అంటే 'ముక్తి కర్మల్లో' కూడా రెండు రకాలు ఉన్నాయి.

ఇందులో కూడా 'పాపకర్మలు' ఉన్నాయి, 'పుణ్యకర్మలు' ఉన్నాయి.

అందుచేత  ముందు దేహకర్మలకి, ఆత్మ కర్మలకి తేడా తెలిస్తే, అప్పుడు ఈ 'ఆత్మ పాపకర్మలు', 'ఆత్మ పుణ్య కర్మలు' గురించి తెలుసుకోవచ్చు.

'దేహపాప కర్మలు', కష్టాన్ని కలిగిస్తే అంటే దుఃఖాన్ని కలిగిస్తే! 'దేహ పుణ్య కర్మలు' భోగాన్ని కలిగిస్తాయి.

అలాగే ఈ 'ముక్తి కర్మలలో,  పాపకర్మలు చేస్తే' ఆత్మ పతనం చెందుతుంది.

ఈ 'ముక్తి కర్మల్లో, పుణ్య కర్మలు చేస్తే' వాడికి "మోక్షమే" కలుగుతుంది.

దేహ సంబంధమైన కర్మలన్నీ కూడా దేహకర్మలు అంటారు. "ఆత్మ సంబంధమైన" కర్మలన్నీ కూడా ముక్తికర్మలు అంటారు.

**1) ముక్తి కర్మల్లో పాపకర్మలు :-**

చాలామంది ధ్యాన మార్గంలోకి వచ్చి కూడా ఎన్నో రకాలుగా ఎంతో మందిని మభ్యపెట్టి  డబ్బు సంపాదిస్తున్నారు. ఆలా వారి అమాయకత్వాన్ని, బలహీనతలని వీళ్ళు ఉపయోగించుకుంటున్నారు. ఇది 'ముక్తి సంబంధమైన టువంటి పాపకర్మ' అంటే 'ఆత్మ సంబంధమైన పాప కర్మ'.

ఇంకా కొంతమంది రకరకాల మాయ మాటలు చెప్పి, ఇతరులను లోబర్చుకొని, వాళ్లని ఎన్నో బాధలకు గురి చేస్తూ ఉంటారు. ఇది కూడా 'ఆత్మ

సంబంధమైన పాపకర్మే'.

ఇంకా కొంతమంది పిరమిడ్ల పేరు చెప్పి చాలా డబ్బులు వసూలు చేస్తూ తమకు సంబంధించిన పనులు, తమ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు, కొంతమంది తమ ఇల్లు కట్టుకుంటున్నారు.

ఇలా ఈ మార్గంలో అనేకరకాలుగా క్యాష్ చేసుకోవడానికి చూసే ప్రతి ఒక్కరు 'ఆత్మ పాపకర్మలు చేస్తున్నట్టే'. దాని ఫలితంగా భవిష్యత్తులో వారి ఆత్మ పతనమవుతుంది. అందుకే, పత్రి గారు ధ్యాన మార్గంలో డబ్బు లావాదేవీలు ఉండకూడదు అని 18 ఆదర్శ సూత్రాలలో చెప్పారు.

గుర్తుంచుకోండి "శ్వాస మీద ధ్యాస" అనేదే ఆత్మకు సంబంధించిన సాధన. కానీ, చాలామంది 'గైడింగ్' అంటే ' మాట మీద ధ్యాస ' అని, ఇంకా రకరకాల ధ్యానాలు చెప్తున్నారు. అవి ఆత్మకర్మ కిందకు రావు. అవి మనసుకు సంబంధించినవి. అందుచేత గైడింగు చేసిన వాళ్ళ ఆత్మకు లాభం కలగదు, ఆత్మ ఉన్నతి పొందరు.

ఎందుచేతనంటే లోకంలో "దేహ సాధనలు" ఉన్నాయి, "మనోసాధనలు" ఉన్నాయి. 'గైడింగ్' అన్నది మనసుకు సంబంధించిన సాధన.

**2) ముక్తి కర్మల్లో పుణ్యకర్మలు:-**

ఒక రకంగా చెప్పాలి అంటే 'శ్వాస మీద ధ్యాస' ధ్యానం ఒక్కటే 'ఆత్మ సంబంధమైన కర్మ' అని గుర్తుపెట్టుకోవాలి. మిగతా సాధనలన్నీ మనసుకు సంబంధించినవి, దేహానికి సంబంధించినవి.

"శ్వాస మీద ధ్యాస", ధ్యానం ఒకటే "ఆత్మ సంబంధమైన పుణ్య కర్మ", అందుచేత ఈ ధ్యానమార్గంలో చేసేవి అన్నీ కూడా ఆత్మకు సంబంధించి పుణ్యకర్మలే.

ముందు దేహ పుణ్య కర్మలకి, ఆత్మ పుణ్యకర్మలకి తేడా తెలుసుకుందాం. షిరిడి సాయిబాబా గుడిలో అన్నదానం చేస్తే, అది దేహ సంబంధమైన పుణ్యకర్మ. ఇప్పుడు కడ్తాల్ యజ్ఞాలలో చేసేటువంటి అన్నదానానికి, భీమవరం మూడు

రోజుల క్లాసులలో జరుగుతున్న అన్నదానానికి చేసినది ఆత్మ సంబంధమైన పుణ్యకర్మ కిందకు వస్తుంది.

అలాగే, స్కూల్లో పాఠ్యపుస్తకాలు పంచి పెడితే అది "దేహ పుణ్యకర్మ". కానీ, ధ్యానానికి సంబంధించిన పుస్తకాలు, జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు ఇతరులకి పంచి పెడితే అది "ఆత్మ పుణ్యకర్మ" కిందకు వస్తుంది.

భీమవరంలో జరిగే శిబిరానికి ఎంతోమంది వస్తున్నారు. వాళ్లు చెప్పినవి వ్రాసుకుంటున్నారు, ఆ జ్ఞానం వాళ్లకే కాదు, వాళ్ళ తర్వాత తరాలకి కూడా చాలా ఉపయోగ పడుతుంది, లాభిస్తుంది. అలాంటి పుస్తకాలు మీరు ఉచితంగా ఇవ్వగలిగితే, అది కూడా "ఆత్మ పుణ్య కర్మ" కిందకే లెక్క వస్తుంది.

అంతేకాదు, చాలామంది ఇతర జీవులను చంపుతారు. ఆ జీవుల్ని చంపి హింసకు కారుకులవుతారు. మరి అలాంటి హింస జరగకుండా వారికి ఆ జ్ఞానం కలిగించడానికి, అహింసకు సంబంధించిన పుస్తకాలు పంచితే అది "ఆత్మ పుణ్యకర్మ" క్రిందకు వస్తుంది. కారణం ఆ జీవి యొక్క ఆత్మ ఎంతో ఉన్నతి పొందుతుంది కాబట్టి. అలా ఒక జీవి యొక్క ఆత్మకు లాభం కలిగించినప్పుడు, వారి ఆత్మ కూడా లాభం పొందుతుంది.

అలాగే ఇతరులకు లాభం కలిగించే జ్ఞానాన్ని మనం అందరికీ పంచుతూ ఉంటే అది కూడా అన్నిటికంటే గొప్పదైన ఆత్మపుణ్యకర్మ. ఇవన్నీ కూడా 'ఆత్మకు సంబంధించినటువంటి పుణ్యకర్మలు'.

ఎవరైనా సరే ఆత్మ కాబట్టి, ఆత్మకు లాభం కలగాలి. దానికి 'ఆత్మసాధన' అయిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చెయ్యాలి. దానితో పాటు ఇతరుల ఆత్మకు లాభం కలిగించే సేవలు చెయ్యాలి. అందుచేత మనమంతా ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాము, అంటే ముక్తి కర్మల లోకి వచ్చాము. అందుచేత ఈ ముక్తి కర్మల్లో అంటే ఆత్మ కర్మల్లో మనం చేసే పనుల వల్ల ఇతరులకి ఎటువంటి నష్టం కలగకూడదు. ముఖ్యంగా 'ధ్యానం' పేరు చెప్పి ఏ రకమైన మోసం చేసినా, మాయమాటలు చెప్పినా, తప్పుదారి నడిపించినా, వాళ్ళ

ఎదుగుదలకు ఆటంకం కలిగించినా, తన స్వార్థానికి ఉపయోగించుకున్నా ఆధ్యాత్మికంగా పతనమైపోతారు.

పెద్దలు దేనికైనా పాపం పండాలి అని అంటారు. ఒకవేళ ఇన్ని చేస్తున్నా వాడికి ఏమీ జరగలేదు అంటే ఇంకా పాపం పండలేదు అని అర్థం. కాని అలా ప్రవర్తించినవారు ఎంతో మంది దెబ్బతిన్నారు, కనుమరుగైపోయారు. వారు ఏదో కొన్నాళ్లు వెలుగుతారు, తర్వాత కనిపించరు. అందుచేత ఇవన్నీ మనం గుర్తుపెట్టుకోవాలి.

అలాగే ఈ దేహ కర్మలలో కానీ, ఆత్మ కర్మలలో కానీ రెండు రకాలుగా ఉన్నాయి. వాటినే 1) కామ్య కర్మలు, 2) నిష్కామ కర్మలు అంటారు.

'కామ్యకర్మలు' అంటే ఫలితం ఆశించి చేసే కర్మలు, 'నిష్కామ కర్మలు' అంటే ఫలితం ఆశించకుండా చేసే కర్మలు.

**1) దేహ కామ్య కర్మ:-**

చూడండి దేహలాభం కోసం అంటే కోరిక నెరవేరాలి అని పూజ చేస్తే అది 'కామ్య కర్మ'. అలాగే యజ్ఞాలు, యాగాలు కూడా 'కామ్యకర్మలు' అంటారు.

వర్షం పడాలని, పుత్ర భోగం కలగాలి అని, రాజ్య విస్తరణకోసం లేకపోతే ఏదో లాభం కలగాలి అని, పెద్ద పెద్ద రాజులు చేసే యాగాలు 'కామ్య కర్మలు'.

**2) దేహ నిష్కామ కర్మ:-**

అలాగే దేహ లాభం కోసం ఏమి ఆశించకుండా చేసే కర్మ 'నిష్కామ కర్మ' అంటారు. నువ్వు దేహలాభం కోసం ఏమైనా చెయ్యి. కానీ చేసిన దాని ఫలితం ఆశించకూడదు. అలా చేసిన కర్మల్ని దేహ నిష్కామ కర్మ అంటారు. భగవద్గీతలో 'నిష్కామ కర్మ' చేసినవారు తప్పనిసరిగా ఫలితం పొందుతారు అని చెప్పబడింది.

అలాగే ఈ 'ఆత్మ కర్మల్లో' కూడా 'కామ్య కర్మలు' ఉన్నాయి, 'నిష్కామ కర్మలు' ఉన్నాయి.

**1) ఆత్మ కామ్య కర్మలు :-**

చాలామంది ఈ ధ్యానంలోకి వచ్చిన వాళ్ళు కోరికల కోసం సంకల్పం పెట్టి ధ్యానం చేస్తారు. ఆలా సంకల్పం పెట్టి ధ్యానం చేస్తే అది 'ఆత్మ కామ్యకర్మ' అవుతుంది. అందుకే నేను చెప్తుంటాను నువ్వు ఏ సంకల్పం పెట్టనక్కర్లేదు, చేయవలసిన ధ్యానం చేస్తే, రావాల్సింది ఆటోమేటిక్ గా వస్తుంది అని.

కారణం సృష్టిని నడిపించే వాడికి అన్నీ తెలుసు, నువ్వు అడగవలసిన పనిలేదు. అందుచేత కోరికలు, సంకల్పాలు అవసరంలేదు. అందుకే, పత్రి గారు, ధ్యానం చెబితే డబ్బు తీసుకోవద్దు అంటారు. మరి ధ్యానం చెప్పడానికి డబ్బులు తీసుకుంటే అది ఫలితం ఆశించడమే అవుతుంది. అందుకే నేను చెయ్యడం మీద దృష్టి పెట్టండి, కోరడం మీద దృష్టి కాదు అని చెబుతూ ఉంటాను. నువ్వు చేయవలసింది చేస్తే, రావాల్సింది ఏటైంలో రావాలో ఆ టైంలో వస్తుంది. నువ్వు ఎందుకు కంగారు పడతావు? అంటాను.

అందుచేత, బాగా గుర్తుపెట్టుకొండి. ఈ కర్మఫలం మనం శరీరం వదిలి ఇంకొక జన్మ తీసుకున్నా కూడా అనుభవిస్తాము. అందుచేత "కూడా వచ్చే దాని మీద శ్రద్ధ పెట్టాలి". అంతేకాదు పాపకర్మలు వద్దు, పుణ్యకర్మలు వద్దు, మోక్షాన్ని ఇచ్చే ముక్తి కర్మలు నిష్కామంగా చెయ్యాలి.

**2) ఆత్మ నిష్కామ కర్మలు :-** మీరు లక్షలు, కోట్లు ఇవ్వనక్కర్లేదు. మీరు ఇవ్వగలిగిన దాంట్లో ఏ కొంచెం ఇచ్చినా అది గొప్పదే! అందుచేత ధనమే ఇవ్వనక్కర్లేదు, ధనం కంటే విలువైన సమయం ఇవ్వండి, వాక్కు ఇవ్వండి, శక్తి ఇవ్వండి, మీ జీవితాన్ని ఇవ్వండి. ఇవన్నీ ఆత్మకు లాభించే సేవలు. ఇవన్నీ కచ్చితంగా ఆత్మ ఉన్నతికి ఎంతో తోడ్పడతాయి. ఇవన్నీ నిష్కామంగా చేసే కొద్దీ, శరీరం వదిలాక ఎంతో ఉన్నతమైన లోకానికి చేరుకుంటారు. తర్వాత మీరు కోరుకున్నటువంటి జన్మ మీకు లభిస్తుంది.

మనమంతా ఉదయాన్నే లేచి ధ్యానం చేస్తున్నాము, జ్ఞానం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం, పుస్తకాలు చదువుతున్నాము, సందేశాలు వింటున్నాము,

నిష్కామంగా సేవలు చేస్తున్నాము. ఆలా చెయ్యడం వల్ల వచ్చిన ఫలితం కంటికి కనిపించదు. కాని మీ ఖాతాలో రికార్డు అవుతుంది. ఆ ఖాతానే ఆకాసిక్ రికార్డ్స్ అంటారు.

అందుచేత కనిపించలేదని, రాదు అని అనుకోవద్దు. చేసిన ప్రతి పనికి ఫలితం ఉండి తీరుతుంది. మనం చేసే ప్రతీ పని ప్రకృతిలో రికార్డు అవుతుంది. దాని ఫలితం కూడా తప్పక ఇవ్వబడుతుంది. అందుకే పత్రి గారు చేసిన ప్రతి పనికి సమయ సందర్భానుసారంగా, ఫలితం తప్పక వచ్చి తీరుతుంది అని చెప్పారు. అందుచేత కోరవలసిన పని లేదు.

అందుచేత చేసింది వృధా కాదని తెలుసుకోండి, పాపకర్మలు చెయ్యకండి, గొప్పలకు పోకండి, పేరు ప్రఖ్యాతులు ఆశించకండి, ప్రలోభాలకు లొంగకండి, ఈ ఆధ్యాత్మిక మార్గంలోనే సంపాదించాలని చూడకండి, చేసే పుణ్య కర్మలు నిష్కామంగా ఉండాలని తెలుసుకొండి.

ముఖ్యంగా 'దేహ పాప కర్మలు' కంటే ఘోరమైనవి 'ఆత్మ పాప కర్మలు' అని తెలుసుకోండి ఇవి చేసిన వారు చాలా నష్టపోవలసి వస్తుందని తెలుసుకోండి.

# కర్మ - అకర్మ
# శ్రీ కృష్ణుల వారి భోధ

**శ్లో॥ కిం కర్మ కి మకర్మేతి కవయోవ్యత్ర మోహితాః**

**తత్తే కర్మ ప్రవక్ష్యామి య జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్ (భ.గీ-4:16)**

తా:-కర్మ అంటే ఏమిటో, అకర్మ అంటే ఏమిటో తెలియక విద్వాంసులు కూడా భ్రాంతి చెందుతున్నారు. కాబట్టి కర్మాకర్మములను తెలుసుకొని దుఃఖకరమైన అజ్ఞానము నుండి విముక్తుడు కావడానికి కర్మ అంటే ఏమిటో తెలుసుకో.

శ్రీకృష్ణుల వారు సత్యమే చెబుతారు. అది అందరికీ ప్రామాణికం, ఆచరించి తీరవల్సిందే.

శ్రీ కృష్ణులవారు దుఃఖాన్ని కలిగించే అజ్ఞానం నుంచి బయటపడాలి అన్నారు. అటువంటి అజ్ఞానం తొలగాలంటే జ్ఞానం పొందాలి. జ్ఞానం పొందితే దుఃఖం నుంచి బయటపడతాము. అజ్ఞానం నుంచి బయటపడాలంటే కర్మ అంటే ఏమిటో తెలుసుకోవాలని అన్నారు. ఆయన ఇంకా "కర్మ ఏదో", "అకర్మ ఏదో" తెలియక, సామాన్యులే కాదు, పెద్ద పెద్ద పండితులు కూడా బ్రాంతి చెందుతున్నారు అని అన్నారాయన.

అంటే పండితులకు కూడా అర్థం కావటం లేదు అని శ్రీ కృష్ణులవారు అన్నారు. అందుచేత, మనం కర్మలు గురించి తెలుసుకోవాలి. అసలు ఏ కర్మలు ఉత్తమమైనవి, ఏ కర్మలు ప్రామాణికం, ఏవి అప్రామాణికం, ఏవి నిషిద్ధాలు, ఏవి సమ్మతము అని తెలుసుకోవడం మనందరికీ అవసరం.

ఎందుచేతనంటే, కర్మస్వరూపం తెలిస్తేనే, ఎవరైనా భౌతిక బంధం నుండి విడుదల పొందేది. మరి భౌతిక బంధంలో చిక్కుకోకుండా వుండాలంటే ఈ 'కర్మ' గురించి అవగాహన వుండాలి.

అందుచేత దేహ త్యాగం చేసిన తర్వాత మళ్లీ మరో శరీరంలో ప్రవేశించకుండా ఉండే 'జన్మరాహిత్యాన్ని' కలిగించే కర్మలని ఆచరించాలి.

సహజంగా ఆత్మ అయిన మనము చనిపోయినపుడు శరీరాన్ని వదిలేస్తాము. పైలోకాల్లో కొన్నాళ్ళు ఉండి మళ్ళీ ఇంకొక శరీరం తీసుకుంటాం.

అలా ఇంకొక శరీరంలో ప్రవేశించకుండా ఉంటే దాన్ని 'జన్మరాహిత్యము' అంటారు, 'మోక్షం' అని కూడా అంటారు. అటువంటి జన్మరాహిత్యం కలిగించే కర్మలనే ఆచరించాలి అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది. మరి దానికి 'కర్మ' అంటే ఏంటో తెలుసుకోవాలి.

శ్రీ కృష్ణ భగవానుడు ఇంకా ఏం చెప్పారు అంటే అన్నిటికంటే కర్మఫల త్యాగం గొప్పదని గీతలో చెప్పారు. అందుచేత ఏవి కర్మలుగా భావించ బడతాయి? అన్న అవగాహన ముందు మనకి కావాలి. అలా కర్మలుగా భావించిన వాటిని నిష్కామంగా అంటే "ప్రతిఫలాపేక్ష లేకుండా" చెయ్యగలిగితే, అప్పుడు జీవిత లక్ష్యమైన మోక్షాన్ని పొందుతాము అని శ్రీ కృష్ణులవారు చెప్పడం జరిగింది.

అందుచేత 'కర్మ' అంటే ఏంటో తెలుసుకుందాము.

సామాన్య మానవులు, పుణ్య కర్మలను గొప్పగా భావిస్తారు. ఎందుచేతనంటే? పండితులు, గురువులు చాలామంది పాపాలు చేయొద్దు. పుణ్యాలు చెయ్యి అని చెప్తూ ఉంటారు. అందుచేత చేయవలసినవి పుణ్య కర్మలని సామాన్య మానవులు భావిస్తారు.

కానీ యోగుల దృష్టిలో పుణ్య కర్మలు కూడా అకర్మలుగానే భావించ బడతాయి. ఈ విషయం శ్యామాచరణ లాహిరి గారు తెలియజేయడం జరిగింది. ఆయన ఏం చెప్పారంటే, సామాన్య మానవులు, పుణ్యకర్మలు "కర్మలుగా" భావిస్తారని చెపుతూ, యోగుల దృష్టిలో అవి 'అకర్మలు'గానే భావించబడతాయి అన్నారు. ఇక్కడ 'అకర్మ' అంటే ఫలితము లేని కర్మ అని అర్థం.

పండితులు కూడా పుణ్యకర్మే, చాలా గొప్ప కర్మ అని భావిస్తారు. కానీ

యోగులు పుణ్యకర్మను ఫలితం ఇవ్వని కర్మగా భావిస్తారని లాహిరి గారు చెప్పడం జరిగింది. మరి, ప్రతి కర్మకి ఫలితం వుంటుందిగా? ఫలితం లేని కర్మ ఎలా అవుతుంది? అని సందేహం రావచ్చు. కాని ఇక్కడ చాలా లోతుగా ఆలోచించాలి.

ఈ జన్మలో, నువ్వు పుణ్య కర్మలు చేశావు. దాని ఫలితంగా మరుజన్మలో భోగాలు అనుభవిస్తావు. బాగా డబ్బు ఉంటుంది, చాలా సుఖాలు అనుభవిస్తావు. కానీ, ఎన్నాళ్ళు అనుభవిస్తావు? నువ్వు చేసుకున్న పుణ్యం అయిపోయే దాకా అనుభవిస్తావు. ఆ  పుణ్యం అయిపోతే, దాని ఫలితం ఇంక వుండదు కదా?

అందుచేత, యోగులు పుణ్యకర్మను 'అకర్మ' గానే భావిస్తారు. చూడండి మీ దగ్గర డబ్బు ఉంది, ఖర్చు పెట్టేశారు. ఇప్పుడు నీ దగ్గర డబ్బు ఉందా? అంటే ఏమీ లేదు అని అంటావు.

అందుకే అలాంటి కర్మలు మాకెందుకని అంటారు యోగులు. యోగులు అసలు వాటిని కర్మ క్రిందే లెక్క వెయ్యరు.  అందుకే పత్రి గారు పాపమేకాదు పుణ్యం కూడా మనకు వద్దు అని అంటారు.

అందుచేత, ఏ కర్మ అయితే ఆత్మకు లాభిస్తుందో! 'దేని ఫలితమైతే ఆత్మకు కూడా వస్తుందో'!  దానినే యోగులు "కర్మగా" భావిస్తారు. అంటే ఆత్మను తెలుసుకోవటానికి, ఆత్మ ఉన్నతికి, ఆత్మ లాభానికి చేసే కర్మ ఏదైతే ఉందో! అదే యోగుల దృష్టిలో  కర్మగా భావించబడుతుంది.

అటువంటి కర్మ ద్వారా వారు ఆత్మానుభవం అంటే మోక్షం పొందగలుగుతారు, జీవిత లక్ష్యాన్ని సాధించగలుగుతారు. మరి అటువంటి కర్మ ఒక్కటే ఒక్కటి, అదే 'ధ్యానం'.

అందుచేత "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒకటే ఆత్మకు సంబంధించి నటువంటి కర్మ అని తెలుసుకోవాలి. అందుచేత ధ్యానం ఒక్కటే "యోగుల" దృష్టిలో 'కర్మ'గా అంటే ఫలితం పొందే కర్మగా భావించబడుతుంది. వారు మిగిలినవన్నీ అకర్మలుగానే భావిస్తారు, అంటే ఫలితం లేని కర్మలుగా భావిస్తారు.

ఎందుచేతంటే? పుణ్యకర్మలు తాత్కాలికమైన, భోగవంతమైన భౌతిక జీవితాన్ని ఇస్తాయి. కానీ జన్మ రాహిత్యాన్ని కలగజేయలేవు. అంటే బంధాన్ని కలిగిస్తాయి, కానీ, బంధ విముక్తులని చెయ్యలేవు. నేను, పత్రీజీ పరిచయం అయ్యేదాకా పుణ్య కర్మలే చేసాను, అవే గొప్పవి అని భావించేవాడిని. కాని పత్రి గారు వచ్చాక అర్థమయింది.

చూడండి భోగం అంటే సుఖం అనుభవించే వాళ్ళకి ధ్యానం చేయమని చెప్తే, నా జీవితం అంతా బాగుంది, ధ్యానం ఎందుకు చేయాలి? అని అంటారు. కానీ ఈ జన్మ బాగుంటుంది, ఇంకొక జన్మ తీసుకుంటే, అప్పుడు పుణ్య కర్మలు లేకపోతే మరలా దుఃఖమే కదా?

ఇప్పుడు మనం ప్రతిరోజు కూడా 3:30 కి లేవటం, నాలుగింటి కల్లా కూర్చోవడం, 6:30 దాకా ఎందుకు చేస్తున్నాము? ఎందుకు ఇంత కష్టపడుతున్నాము? అంటే ఈ బంధంలో నుంచి బయట పడటానికి జన్మరాహిత్యాన్ని పొందడానికే.

శ్రీకృష్ణ భగవానుడు 'నిష్కామ కర్మ' చేయమని అన్నారు. అందుచేత మనల్ని బంధ విముక్తులను చేసే ధ్యానాన్ని నిష్కామంగా చేస్తే, అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా చేస్తే, ఎవరైనా జీవితంలో అత్యున్నత స్థితి పొందుతారు.

అందుచేత **"ప్రతిఫలాపేక్ష లేకుండా చేసేటువంటి ధ్యానమే అసలైన నిష్కామ కర్మ"** అని తెలుసుకోవాలి. ఇదే మానవుడు చేసే అన్ని కర్మల కంటే గొప్ప కర్మ. అదే శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా బోధించడం జరిగింది.

# ధ్యానం అంటే?

గమనిస్తే ఎవరిని చూసినా మరణించేదాకా చూసుకుంటున్నారు, ఆలోచిస్తున్నారు, వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. మరణించిన తర్వాత "కూడా వచ్చే వాటికి" ప్రాముఖ్యం ఇవ్వటం లేదు. కాని మరణించిన తర్వాత "కూడా వచ్చేవాటి మీదే" "భవిష్యత్తుజన్మ" ఆధారపడి ఉంటుంది.

చాలామంది నా జన్మ ఇలా అయిపోయిందే అని ఈ జన్మ గురించి బాధపడతారు. కానీ, భవిష్యత్తు తీర్చిదిద్దుకోవడానికి ఆలోచించరు. ఆలోచించండి ఈ జన్మ శాశ్వతమా? అంటే కాదు. అంటే ఇప్పుడు ఉన్నవి ఏదీ పర్మనెంట్ కాదు, ఇప్పుడు ఉన్నవాళ్లు కూడా కొంతకాలమే వుంటారు.

మరి నీకు ఈ జన్మ నచ్చనప్పుడు, నీకు నచ్చే జన్మ కావాలంటే? 'కూడా వచ్చే వాటిని' తెలుసుకొని, వాటి మీద అవగాహన పెంచుకొని, దానికి అనుగుణంగా, వాటిని సరి చేసుకుంటే, నీ భవిష్యత్తు జన్మ ఎంతో వైభవంగా ఉంటుంది.

అందుచేత తెలివైన వాళ్లు 'కూడా వచ్చే వాటి' గురించి ఆలోచిస్తారు. అందుకే మనం వీటికి ఎంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. ఇంత లోతుగా విశ్లేషించుకుంటున్నాము.

మరి కూడా వచ్చేవి. 1) వాసనలు అంటే ఇష్టాలు అంటే ఆసక్తులు కాని, అలాగే 2) సంస్కారాలు అంటే అలవాట్లు, 3) కర్మలు, 4) జ్ఞానం. వీటి గురించి చెప్పుకుంటున్నాము.

ఇప్పుడు కర్మలు గురించి చెప్పుకుంటున్నాము. ఈ కర్మల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. ఇది చాలా ఇంపార్టెంట్. ఈ జన్మలో చేసే కర్మలే, మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. అందుచేత ఈ కర్మలు ఎన్ని రకాలు? ఎలాంటి కర్మలు చెయ్యాలి? ఎటువంటి కర్మలు మనకి లాభిస్తాయి? అన్నవి తెలుసుకోవాలి.

కర్మలు మూడు రకాలుగా చేసేవారు వున్నారని  చెప్పుకున్నాము.

కొంతమంది ప్రారంభ జన్మల్లో ఉన్నవాళ్లు పాపకర్మలు చేస్తారు. కొంతమంది మధ్యస్థ జన్మల్లోకి వచ్చిన వాళ్లు పుణ్య కర్మలు చేస్తారు. చివరి జన్మల్లోకి వచ్చేసరికి ముక్తి కర్మలు చేస్తారు. ఈ ముక్తి కర్మల గురించి ధ్యానమార్గంలోకి, జ్ఞానమార్గంలోకి వచ్చిన వాళ్లకే తెలుస్తుంది.

శ్రీ కృష్ణుల వారు ప్రతిఫలాపేక్ష లేకుండా ధ్యానం ("శ్వాస మీద ధ్యాస") చేస్తే, అదే అసలైన నిష్కామ కర్మ అని చెప్పడం జరిగింది.

దీన్నే ఓషో ఏమన్నారు అంటే?

**'ఓషో'  "ప్రతిఫలాపేక్ష లేని నిర్వ్యాపార మనోస్థితే  ధ్యానం"**అని అన్నారు.

నిర్వ్యాపార అంటే ఏమీ చేయకుండా, అంటే ఆలోచన లేకుండా ఉండే మనోస్థితినే ధ్యానం అంటారని  ఓషో చెప్పారు.

అందుచేత ప్రతిఫలం ఆశిస్తే ధ్యానం అవ్వదు అని తెలుసుకోవాలి. ప్రతిఫలం ఆశించకుండా చేసే ధ్యానమే మోక్షానికి దారితీస్తుంది.

ఇప్పుడు మనమంతా ఏ సంకల్పాలు లేకుండా, ఏ కోరికలు లేకుండా ఆ పనే  చేస్తున్నాము.  మనకు తెలుసు, "చేయవలసింది చేస్తే, రావాల్సింది వస్తుందని". అందుకని  ప్రతిఫలం ఆశించకుండా  'శ్వాస మీద ధ్యాస' ఉంచి ధ్యానం  చేస్తున్నాము.

మార్నింగ్ జూమ్ లో  పాల్గొంటున్నాము,  అలాగే ప్రతినెలా భీమవరం క్లాసులో గంటలు గంటలు కూర్చుంటున్నాం. ఇదే చివరికి 'మోక్షానికి' దారి తీస్తుంది.

ఇది అర్థం అవ్వడం కోసం "ఓషో" ఒక కథ చెప్పారు.  ఆ కథ ఏమిటో ఇప్పుడు  తెలుసుకుందాము.

ఒక వ్యక్తి మోక్షం పొందడం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాడు. ఎంతో మందిని కలుస్తున్నాడు. అప్పుడు, అతనితో ఒక ఆయన ఏమన్నారు అంటే, హిమాలయాల్లో ఒక గురువు ఉన్నారు. నువ్వు కనక ఆయన్ని

కలుసుకోగలిగితే, తేలికగా నీ కోరిక నెరవేరుతుంది అని చెప్పారు.

వెంటనే అతను ఆశతో తన ఆస్తి అంతా అమ్మేసి, హిమాలయాలకు వెళ్ళాడు. ఆ హిమాలయాలు తక్కువ ఉంటాయా? అలా హిమాలయాల్లో ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. వాడి దగ్గర ఉన్న సొమ్మంతా అయిపోయింది. అయినా వాడికి ఆ గురువు కనిపించలేదు.

అలా తిరుగుతూ ఉంటే వాడికి ఎవరో చెప్పారు , ఈ హిమాలయాల్లో పలాన ప్రదేశంలో, ఒక ముసలాయన ఉండేవాడు, ఆయన చాలా శక్తివంతుడు, మహిమలు ఉన్నవాడు... బహుశా నువ్వు వెతికేది ఆయన కోసమే అయ్యి వుంటుంది, వెళ్లి చూడు అని చెప్పారు. వెంటనే ఆ వ్యక్తి ఆశతో ఆ ప్రాంతానికి వెళ్లి వెతికాడు.

కానీ, అతనికి, ఆయన కనపడలేదు. వాడి దగ్గర ఉన్న ఆహారం అయిపోయింది. తినడానికి ఏమీ లేదు, శరీరంలో ఉన్న శక్తి కూడా క్షీణించిపోయింది, నడవలేక కింద పడిపోయాడు. అలా నిరాశ పొందిన సమయంలో కొంచెం దూరంలో, చిన్న గుడిసె కనిపించింది. అప్పుడు వాడు “నేను వెతికే గురువుగారు, అక్కడ వుండి వుండొచ్చు” అని అనుకున్నాడు.

వెంటనే వాడు నడవలేకపోయినా, పాక్కుంటూ ఆ గుడిసెను సమీపించాడు. లోపలికి తొంగి చూసాడు కాని లోపల ఎవ్వరు కనిపించలేదు.

ఆ క్షణంలో అతనిలో ఉన్న ఆశలన్నీ నశించాయి. వెంటనే ఇక నావల్ల కాదు, అనుకుంటూ కింద పడిపోయాడు. కొద్దిసేపటికి ఏదో చప్పుడు వినిపించింది. ఎవరో ముసలి వ్యక్తి కంఠం వినిపించింది. ఆయన ఏమన్నాడంటే? నాయనా నువ్వు కోరుకున్నది పొందావా? అని అడిగాడు. అప్పుడు, ఈ వ్యక్తి “ఊ” అన్నాడు. ధ్యానం అంటే ఏమిటో తెలిసిందా? అని అడిగాడు. ఈ వ్యక్తి “ఊ” అన్నాడు.

ఆ తర్వాత ఆ మాట్లాడిన వ్యక్తి కనబడలేదు. మరి ఆ క్షణంలో ఏం జరిగింది? ఆ గుడిసెలో ఎవరూ కనబడకపోయేసరికి, వాడిలోని ఆశలన్నీ

అడుగంటాయి, కోరికలన్నీ పోయాయి, మనసు ఏమి కోరలేదు. అతనిలో ఏ భావాలు లేవు, అన్ని ఆశలతో పాటు 'మోక్షం' పొందగలనన్న ఆశ కూడా పోయింది.

ఆ క్షణంలో అతనికి జ్ఞానోదయం అయ్యింది. అతని మనసు ఒక్కసారిగా శూన్యం అయ్యింది. వెంటనే అతను ఎవరో అతను తెలుసుకున్నాడు. అతను కోరుకున్నది అతను పొందాడు. అంతులేని ఆనందానుభూతిని పొందాడు. ధ్యానం అంటే ఏంటో తెలుసుకోగలిగాడు.

మనకు ఇక్కడ ఏం తెలుస్తుంది అంటే.. వాడు అప్పటిదాకా మోక్షం పొందాలనే కోరికతోఎంతో కష్టపడ్డాడు. కానీ, ఆ ఆశ నిరాశ అయ్యేసరికి ఆ చివరి కోరిక కూడా వదిలేశాడు. ఆ క్షణంలో వాడికి జ్ఞానోదయం అయ్యింది. అన్నీ తెలుసుకున్నాడు. ఎప్పుడు పొందనంత ఆనందానుభూతి పొందాడు. అంటే ఆత్మసాక్షాత్కారం పొందాడు.

మరి "ఓషో" చెప్పినటువంటి ఈ కథను బట్టి "ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే ధ్యానమే అసలైన నిష్కామ కర్మ" అని మనకి అర్థం అవుతుంది.

శ్రీకృష్ణ భగవానుడు చెప్పినటువంటి నిష్కామకర్మ, అంటే ప్రతిఫలం ఆశించకుండా చేసేటువంటి ధ్యానమే అని మనకు తెలుస్తుంది. దీన్నే "కర్మయోగం" అని కూడా అంటారు. అందుచేత, ఎవరైనా సరే, "ప్రతిఫలాపేక్ష లేకుండా ధ్యానం" చేయాలని తెలుసుకోవాలి.

అందుచేత మనలో ఏ ఆశలు, కోరికలు ఉన్నా మనం ఆ పరిపూర్ణ స్థితి పొందలేము, అంటే 'ఆత్మ సాక్షాత్కారము' పొందలేము అని తెలుసుకోవాలి.

మనలో మమకారాలు ఉంటాయి, కోరికలు ఉంటాయి, ఆశలు వుంటాయి. వీటిలో ఏది ఉన్నా, ఎన్ని ప్రయత్నాలు చేసినా మనం ఆ స్థితికి చేరుకోలేము, ఆత్మ సాక్షాత్కారం పొందలేము. అందుచేత, ఇది మనం అర్థం చేసుకోవాలి. మెల్లిమెల్లిగా, మనం చేసే సాధన తీవ్రతను బట్టి ఆ స్థాయికి చేరుకోవచ్చు. అలాంటి వాడికంటే అదృష్టవంతుడు ఎవడు లేడు.

# కర్మలో అకర్మ - అకర్మలో కర్మ

**- శ్రీ కృష్ణభగవానుడు**

చనిపోయిన తర్వాత "కూడా వచ్చే" వాటి గురించి చెప్పుకుంటున్నాము.

ఇప్పుడు, మనం కర్మలు గురించి చెప్పుకుంటున్నాం. భవిష్యత్తు జీవితం బాగుండాలి అంటే కర్మల మీద ఎక్కువ దృష్టి పెట్టాలి.

ఈరోజు శ్రీకృష్ణ భగవానుడు చెప్పినటువంటి మరో శ్లోకం చెప్పుకుందాం. ఎందుకంటే శ్రీ కృష్ణ భగవానుడు చెప్పినవి చాలా ముఖ్యం కాబట్టి. ఇవి తెలుసుకోకుండా మనం కర్మలు చేస్తే, నష్టపోయేది మనమే.

మనం అనుకుంటాము చాలా గొప్ప పనులు చేస్తున్నాము అని. కానీ, అంత గొప్ప వాళ్ళు చెప్పింది అర్థం చేసుకోకుండా, మన ఇష్టం వచ్చినట్టు, నచ్చినట్టు చేస్తే, మనం అనుకున్న ఫలితం రాదు. నష్టపోవాల్సి ఉంటుంది. అందుచేత శ్రీకృష్ణ భగవానుడు చెప్పినటువంటి శ్లోకం 4వ అధ్యాయంలో 18వ శ్లోకం చెప్పుకుందాం.

**శ్లో॥ కర్మ ణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్**
**(భ.గీ.4-18)**

తా:-ఎవడు కర్మ యందు అకర్మను, అకర్మము నందు కర్మను చూస్తాడో వాడే మానవులందరిలో బుద్ధిమంతుడు. వాడే యోగి అవుతున్నాడు. సకల కర్మలు ఆచరించిన వాడు అవుతున్నాడు.

ఎందుచేతనంటే అన్నిటికీ మనస్సే ప్రధానం అవటం వల్ల కర్మ చేయని వారికి, కర్మ చేసిన వారికి, వారివారి భావాన్ని అనుసరించే ఫలితం కలుగుతుంది, కానీ కర్మను బట్టి మాత్రం కాదు. ఇదే శ్రీకృష్ణ పరమాత్మ పై శ్లోకం ద్వారా చెప్పింది. ఇది చాలామందికి అర్థం కాక కర్మను చూస్తున్నారు కానీ ఆ కర్మలో వారి భావాన్ని గ్రహించలేకపోతున్నారు. గొప్ప యోగీశ్వరుడైన శ్రీ కృష్ణ పరమాత్మ

చెప్పింది సామాన్యులు అర్థం చేసుకోవటం చాలా కష్టం, చేసుకోలేరు కూడా.

చాలామంది పూజలు, ఆరాధనలు చేస్తారు. దేనికోసం అంటే భగవంతుడు తమ కోర్కెలు తీరుస్తాడని. అంటే వీరి భక్తి కోరికల మీద కానీ భగవంతుని మీద కాదు. అంటే వీరి బాహ్య చర్యలు భగవంతుని మీద, భావం కోరికల మీద అని స్పష్టంగా అర్థమవుతుంది.

కానీ పై శ్లోకం ద్వారా తెలుసుకోవలసింది ఏమిటంటే బాహ్య చర్యల కంటే భావం ప్రధానం కావటం వలన వీరి భక్తి భగవంతుని మీద కాకపోవటం వల్ల భగవంతుని అనుగ్రహం పొందలేకపోతున్నారు. అందుచేత భావం శుద్ధంగా ఉండాలి, అంటే బాహ్యంలోనేకాదు భావంలోకూడా నువ్వుచేసేపని నిష్కామంగా ఉండాలని చెప్పడం జరిగింది.

చిన్న ఉదాహరణ చూద్దాం. ఇద్దరు సాధువులు ప్రయాణం చేస్తుంటే....వారికి దారిలో ఒక యేరు అడ్డు వచ్చింది. వారు ఏరు దాటబోతుండగా అక్కడ ఒక స్త్రీ ఆ ఏరు దాటలేక అక్కడే నిలబడి వుంది. ఈ సాధువులను చూడగానే ఆమె వాళ్లను ఏరు దాటించమని కోరింది. వెంటనే వారిద్దరిలో ఒక సాధువు ఆమెను ఎత్తుకుని ఏరును దాటించాడు.

తరువాత ఇద్దరు సాధువులు తమ దారిన వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్ళిన తరువాత రెండవ సాధువు ఏమయ్యా స్త్రీని ముట్టుకుని అపచారం చేశావు? ఈ విషయం గురువు గారికి తెలిస్తే ఏమవుతుందో తెలుసా? అన్నాడు. అప్పుడు మొదటి సాధువు మనం రెండు మైళ్ళు దాకా వచ్చాం. నువ్వు ఆవిడను ఇంకా మోసుకొస్తున్నావా? నేను ఆమెను అక్కడే వదిలేశానే? అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. ఇక్కడ ఏమి జరిగిందంటే మొదటి సాధువు ఆ స్త్రీ అభ్యర్థన మేరకు నదిని దాటించాడు. కానీ రెండవ సాధువు ఆ స్త్రీని ముట్టుకోలేదు. కానీ ఆమె గురించే ఆలోచిస్తున్నాడు.

ఇక్కడ గ్రహించవలసింది స్త్రీని ముట్టుకోకపోయినా రెండవ సాధువు మనస్సులో ఆ భావం ఉండడం వల్ల, రెండు మైళ్ళు వచ్చినా ఆవిడను

మరచిపోకపోవటం వల్ల, భౌతికంగా కర్మ చేయకపోయినా, కర్మ చేసిన వాడయ్యాడు. మొదటి సాధువు స్త్రీని ముట్టుకున్నా ఆవిడకు సాయం చేయాలన్న భావం తప్ప మరే భావం మనస్సులో లేకపోవడం వల్ల కర్మ చేసినా, కర్మ చేయని వాడయ్యాడు.

అందుచేత శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన ప్రకారం “కర్మ లో అకర్మ” అంటే కర్మ చేసినా భావం శుద్ధంగా ఉండటం వలన మొదటి సాధువు కర్మ చెయ్యనివాడయ్యాడు.

అలాగే రెండవ సాధువు కర్మ చెయ్యకపోయినా కర్మ చేసిన వాడయ్యాడు. దీనినే “అకర్మలో కర్మ” అని అంటారు. ఇదే పై శ్లోకం ద్వారా భగవానుడు ఇచ్చిన సందేశం.

## పత్రిగారి కోపం

అలాగే పత్రి గారిని చూసి చాలామంది అదేమిటి భగవంతుడంటారు. ఆయనకు అంత కోపమేమిటి? అని అంటారు, కొంతమంది పైకి అనలేక పోయినా లోపల అనుకుంటారు. ఆయనతో సన్నిహితంగా ఉండే వారికి కూడా ఇది అర్థం కాదు.

కానీ పత్రి గారి కోపం ఇతరుల పొరపాటు మాటల మీద, చేతల మీద, వారి అజ్ఞాన చర్యలమీదే కానీ వ్యక్తిగతంగా వారి మీద కాదు. ఆయన ఉద్దేశం ఎంతసేపూ వారి జీవితాన్ని సరి చేయటానికి, వారి గుణాలు మార్చటానికే కానీ, వారి మీద ద్వేషం, పగ, కక్ష తో కాదు. ఎందుకంటే ఆయనకు శత్రువులు ఎవరూ లేరు. అందుచేత ఆయన పైకి కర్మ చేసినట్టు కనపడినా ఆయన అకర్ముడే అంటే కర్మ చేయని వాడే.ఇదే విషయం చాలామంది గురువులలో కూడా మనం గమనించవచ్చు.

అలాగే ఆయన దగ్గరకు ఎవరు వచ్చినా జ్ఞానాన్ని పొందటానికే వచ్చారనే భావిస్తారు. జ్ఞానం కోసం వచ్చిన వారిని ఏ గురువైనా వారి అహంకారాన్ని పోగొట్టడానికే ప్రయత్నిస్తారు. శిష్యుల అహంకార స్థితిని బట్టి ఒకరిని

కోపగించుకుంటారు, ఒకరిని చిరాకు పడతారు, ఒకరిని పట్టించుకోనట్లు వుంటారు, ఇంకొకరిని ఆప్యాయంగా పలకరిస్తారు, మరొకరిని కౌగిలించు కుంటారు, ఇంకొకరిని కొట్టవచ్చు కూడా! ఇలా రకరకాలుగా ఆయన ప్రవర్తన వుంటుంది.

గురువు ప్రవర్తన ఎప్పుడు, ఒకే రకంగా ఉండదు. శిష్యుని బట్టి వుంటుంది. శిష్యునిలో అహంకారాన్ని తొలగించి, వారిని జ్ఞానవంతులుగా చేయటానికే ఏ గురువైనా ప్రయత్నిస్తారు. అదే పత్రి గారి ప్రయత్నం కూడా. అందుచేత కర్మలు చేస్తున్నా ఆయన అకర్ముడే, ఏ కర్మా ఆయనకు అంటదు. శ్రీకృష్ణ భగవానుడు చెప్పింది కూడా అదే. అటువంటి పత్రి గారిని సామాన్యులు ఎలా అర్థం చేసుకోగలరు?

ఆయన కోపగించుకుంటున్నారని వీళ్ళు వెళ్ళిపోతే నష్టపోయేది వాళ్ళేగా? బయటికి వెళ్ళిపోతే, ఆయన దగ్గర ఉన్న జ్ఞానం వాళ్లకి లభిస్తుందా? ఆ జ్ఞానం ఇచ్చే వాళ్ళు ఎవరున్నారు? అందుచేత నష్టపోయేవాడు వాడే. వాడి మంచి కోసం ఆయన చేసింది అపార్థం చేసుకుంటే ఆయనేమి చేస్తారు?

ఇంకా కొంతమంది వాళ్లని తిట్టకపోయినా, ఎవరినో తిడితే, అలా తిడతారేంటి అని అంటూ, ఆయనని వదిలేసిన వాళ్ళు చాలా మంది ఉన్నారు.

గురువు యొక్క చర్యలు ఎవరికి అర్థం కావు. ఎప్పుడూ ఒకే రకంగా వుండవు. ఎప్పుడు కూడా గురువు ఏం చేసినా మనకి అనవసరం మనం మాత్రం మనం చేసే పనుల మీద, మన జ్ఞాన సంపాదన మీద దృష్టి పెట్టాలి.

ఆ పనే నేను చేశాను. నా లోపం ఏమైనా ఉంటే సరి చేసుకున్నాను. అందుకే ఈ స్థాయికి ఎదగడానికి అవకాశం వచ్చింది.

అందుచేత, ప్రతి ఒక్కళ్ళు ఇది అర్థం చేసుకోవాలి. శ్రీ కృష్ణ భగవానుడు చెప్పినటువంటి శ్లోకం, పత్రి గారి చర్యలు గురించి మనం అర్థం చేసుకోవాలి.

మనమంతా జ్ఞానమార్గంలోకి వచ్చాము. అవతార్ మెహర్ బాబా చాలా స్పష్టంగా చెప్పారు. ముముక్షువు అంటే సాధకునకు గురువు యొక్క సహాయం

చాలా అవసరమని చెప్పారు.

సాధకుడు తన సొంతంగా ప్రయత్నం చేయొచ్చు, వాడు స్వయంగా వారి ఇంట్లో కూర్చొని చేసుకోవచ్చు, పుస్తకాలు చదువుకోవచ్చు. కానీ, గురువు సహాయం లేకుండా, మధ్యస్త భూమికల్లో చిక్కుకు పోతాడు. ఆరవ భూమికను దాటడం కూడా అసాధ్యం అని అన్నారు.

దాని మీదే నేను "మెహర్‌బాబా సందేశం" అనే పుస్తకం రాశాను. ఆ పుస్తకం చదవండి. మీకు సరైన గైడెన్స్ ఉంటుంది.

ఎందుకంటే మనకి తెలియకుండానే ఈ మాయలో పడిపోతాము. ఆ గురువు హెచ్చరికలతో మరలా మనం దారిలో పడే అవకాశం ఉంటుంది.

అందుచేత, ప్రతి ఒక్కళ్ళు ఈ విషయం తెలుసుకోవాలి. మరి, ఇవన్నీ అర్థం చేసుకుంటే, ఆచరించగలిగితే, ఎన్నో జన్మలు అక్కర్లేదు. చాలా తక్కువ జన్మల్లో మన లక్ష్యాన్ని మనం సాధించగలుగుతాము.

# జ్ఞానం

ఎవరైనా సరే తన జీవితంలో తన కూడా వచ్చేవాటికి ప్రాముఖ్యం ఇవ్వాలి, తన కూడా సరైనవి తీసుకువెళ్ళగలగాలి. తనకు అంటే ఆత్మకు లాభం కలిగించేవి తీసుకువెళ్ళగలగాలి. అంతేకానీ ఆత్మకు నష్టం కలిగించేవి తీసుకెళ్తే వాడికంటే తెలివి తక్కువ వాడు ఇంకెవడూ వుండడు.

అందుచేత అసలు ఎటువంటివి తీసుకువెళ్లాలో తెలుసుకుని, తన కృషి ద్వారా వాటిని సంపాదించుకుంటే? వాడికంటే అదృష్టవంతుడు ఇంకెవడు వుండడు.

విచిత్రం ఏమిటంటే లోకంలో ప్రతి ఒక్కరూ డబ్బు మీదా, సంసారం మీదా, సంపదల మీదా జీవితమంతా దృష్టి పెడతారు. కానీ వాటిలో ఒక్కటీ వారి కూడా రాదు. పైగా వాటికోసం చేయకూడని తప్పులూ, పాపాలూ చేస్తారు. ఏమౌతుంది? ఆ పాపాల ఫలితమే కూడా పట్టుకెళ్ళాల్సి వస్తుంది. అప్పుడు వారి భవిష్యత్తు నాశనం అయిపోతుంది. అందుచేత కూడా పట్టుకెళ్ళే వాటి మీద అవగాహన ఉండాలి.

ఇప్పుడు కూడా పట్టుకెళ్ళే వాటిలో జ్ఞానం గురించి చెప్పుకుందాం.

జ్ఞానం 'కూడా వస్తుంది'. ఈ జ్ఞానం ఎవరికైనా శాశ్వతంగా ఉంటుంది. జ్ఞానం అంత గొప్పది. ఇంక ఎన్నీవున్నా అవన్నీ అశాశ్వతం. జ్ఞానం ఒక్కటే శాశ్వతం.

పత్రిగారు ఆయన గురించి ఏం చెప్పారంటే? నేనింత జ్ఞానాన్ని ప్రదర్శించగలుగుతున్నానంటే? ఎన్నో జన్మలలో నేను కృషి చేశాను. అంతకు ముందు బుద్ధుడి దగ్గర ఆనందుడిగా ఉండేవాడిని, తర్వాత ఇంకో జన్మలో బెంజమిన్ ఫ్రాంక్లిన్ అని చెప్పి గొప్ప ఎన్లైటెన్డ్ మాస్టర్ గా, తర్వాత ఒరిస్సాలో జీవితమంతా ఏకధాటిగా ధ్యానం చేశాను, తర్వాత హైదరాబాదులో 'హజరత్ ఇనాయత్ ఖాన్ ' అని సూఫీ మాస్టర్ గా , తర్వాత ఈ జన్మలో పత్రిలా జన్మ తీసుకున్నాను అన్నారు.

ఆయన దగ్గర అపారమైన జ్ఞానం ఉంది. అదంతా ఈ జన్మలో బయటికి వచ్చింది. అందుకే అతి స్వల్ప కాలంలోనే ఎన్నో లక్షల మంది ఆయన్ని అనుసరించారు.

ఎందుకంటే ఎవరికైనా కావాల్సింది జ్ఞానమే. అందుచేత జ్ఞాన కాంక్షలో ఉన్న వాళ్లంతా ఆయనకు ఎట్రాక్ట్ అయ్యారు. మనమంతా కూడా ఆయనకి అలాగే ఆకర్షితులు అయ్యాం. ఆయనకు ఇంతటి జ్ఞానం, ఇంత టాలెంట్ ఎలా వచ్చింది? అంటే గత జన్మల్లోదే అని నాకు అర్థమైంది.

నేను కూడా ధ్యానం చేశాక ఎన్నో పుస్తకాలు వ్రాయగలిగాను, ఎన్నో క్లాసులు చెప్పగలుగుతున్నాను, ఎన్నో చోట్ల తిరగ గలుగుతున్నాను. నాకు కూడా అర్థమైంది ఇంతకు ముందు జన్మల్లో నేను చేసిన కృషే ఇప్పుడు నాకు వ్యక్తం అవుతుంది. ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే? గత జన్మలలో సంపాదించుకున్న జ్ఞానం ఈ జన్మకి వస్తుందని తెలుసుకోవడానికే.

నాకే కాదు మీకు కూడా సంపాదించుకున్న జ్ఞానం కూడా వస్తుంది. నేను అందుకే మీ అందర్నీ చాలా అదృష్టవంతులు అంటాను.

ఎందుకంటే మీరంతా కూడా జ్ఞానకాంక్షతో నా దగ్గరికి రావడం జరిగింది. ఇంత శ్రద్ధగా ప్రతిరోజూ ఇన్ని వందల మంది పాల్గొంటున్నారు. మీ దగ్గర కనుక ఆసక్తి లేకపోతే రారు కదా? ఉదయం జూమే కాకుండా, ప్రతినెలా భీమవరం క్లాస్ కి కూడా వస్తున్నారు. కానీ ఇప్పుడు మీరు చేసే ఈ పని, మీరు పడే కష్టం, మీరు చేసే ప్రయత్నం వృథా కాదు. కచ్చితంగా మీ భవిష్యత్తులో మీకు ఎంతో లాభం చేకూరుస్తుంది. మిమ్మల్ని చాలా తొందరగా మీ జీవిత లక్ష్యాన్ని చేరుకునేలా చేస్తుంది.

అందుచేత మీ పరిస్థితులు చూసి అంటే ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, కుటుంబ పరంగా, సమాజ పరంగా మీ పరిస్థితి చూసి బాధపడాల్సిన పనిలేదు. ఈ మార్గంలోకి రావడమే మీరు గర్వించదగ్గ విషయం. చూడండి ప్రపంచంలో ఎన్నో కోట్ల మంది ఉన్నారు? అందులో ఎంతమంది ఈ జ్ఞానమార్గంలోకి వస్తున్నారు? ఆఖరికి ఈ ధ్యానంలోకి వచ్చిన వాళ్ళు కూడా ఈ జ్ఞానాన్ని

పొందే ప్రయత్నం చెయ్యట్లేదు. వారికి జ్ఞాన ఆసక్తి లేదు. వాళ్ళు దేహలాభాలు, ప్రాపంచిక లాభాలు చూసుకుంటున్నారు, వాటికోసమే ధ్యానం చేస్తున్నారు. అందుకే ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చిన మీరు చాలా అరుదైనవారు అని అంటాను.

అందుచేత మీలో వున్న కొన్ని వాసనలు, సంస్కారాలు తొలగించడానికే నేను ప్రయత్నం చేస్తూ ఉంటాను. ఒక్కోసారి కొంచెం కఠినంగా మాట్లాడాల్సి వస్తుంది. కానీ నాకు తెలుసు మీరంతా గొప్ప స్థితిలో ఉన్నారని. నేను పత్రి గారి విషయంలో కూడా చూశాను. ఆయన నన్ను ఎప్పుడూ పొగిడేవారు కాదు. ఎంత గొప్ప పని చేసినా. ఏం చేసినా పొగిడేవారు కాదు. మధ్య మధ్యలో అనుకునేవాడిని  ఏమిటి ఈయన ఒక్కసారి కూడా ఏమీ అనరు అని. తర్వాత నాకు అర్థమైంది. ఆయనే పొగిడితే నాకు అహంకారం పెరిగిపోతుందని. కానీ ఆయన చర్యల ద్వారా ఆయనకు నేను అంటే చాలా ఇష్టమని నేను గ్రహించాను. అందుచేత ఆయన దగ్గరనుంచి పొగడ్తల కోసం చూసే వాడిని కాదు.

అందుచేత  గుర్తుపెట్టుకోండి. ఇప్పుడు ఏదైతే జ్ఞానం గురించి మనం చెప్పుకుంటున్నామో  ఆ జ్ఞానం మన కూడా వస్తుంది. ఈ జ్ఞానం వల్ల మనకి మంచే జరుగుతుంది, ఎంతో లాభం అంటే మోక్షమే కలుగుతుంది. అందుచేత మనకి వచ్చినటువంటి కొద్దిపాటి జ్ఞానంతో సరి పెట్టుకోకుండా, ఆ జ్ఞానాన్ని ఇంకా ఇంకా పెంచుకోవాలి, ఇంకా ఎదగాలి.

దానికి  వశిష్ఠుల వారు చెప్పినటువంటి ఆధ్యాత్మిక త్రిరత్నాలు  1)సాధన 2)స్వాధ్యాయం  3)సాంగత్యం. మూడూ త్రికరణ శుద్ధిగా పాటిస్తూ... చేయగలిగిన కృషి  చేయాలి.

అందుచేత అసలు జ్ఞానం అంటే ఏంటి?  జ్ఞానం పొందిన వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? జ్ఞానం పొందకపోతే అజ్ఞానంలో ఉన్న వారి ప్రవర్తన ఎలా ఉంటుంది? ఈ విషయాలు తెలుసుకుందాం. అప్పుడు  మనం ఏ స్థితిలో ఉ న్నాం? అందులో ఎన్ని పాటిస్తున్నాం? ఇంకా పాటించవలసినవి ఏమిటి? ఇవన్నీ మనకు అర్థమవుతాయి. అప్పుడు  మనం వాటిని సంపాదించుకుని

ఆచరిస్తాం. దీనికి ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. జ్ఞానం పెరిగిందా? లేదా? అన్నది మీ ప్రవర్తనను చూసుకుంటే మీకే తెలుస్తుంది.

అందుచేత వాటిని తెలుసుకుంటే వేటిలో వీక్ గా ఉన్నాం? వేటిని ఆచరిస్తున్నాం? ఇంకా వేటిని మనం సరి చేసుకోవాలి? ఇవన్నీ మనకి బాగా అర్థమవుతాయి. ఎందుచేత నంటే జ్ఞానం పొందే వారి ప్రవర్తనలో చాలా తేడా ఉంటుంది, ఆలోచన విధానంలో తేడా ఉంటుంది, మాట్లాడే విధానంలో తేడా ఉంటుంది, చేసే కర్మల్లో, కోరికల్లో చాలా తేడా ఉంటుంది.

ముందు జ్ఞానమంటే ఏమిటో తెలుసుకుందాం. జ్ఞానమంటే 'ఉన్నదానిని' గుర్తించడం. అలాగే గుర్తించిన దానిని ఆచరించడమే 'విజ్ఞానం'. సృష్టిలో వున్నది 'ఆత్మ' ఒక్కటే. మిగిలివన్నీ ఉండనివే. అందుచేత అటువంటి వుండే ఆత్మకు సంబంధించిన జ్ఞానం సంపాదించుకోవాలి. ఆ జ్ఞానం వల్లనే మనం దుఃఖం నుంచి బయటపడతాము.

లోకంలో చూస్తే చాలామంది దుఃఖంలో ఉన్నారు. కొంతమంది ఆనందంగా జీవిస్తారు, కొంతమంది ఇతరులకు సేవ చేస్తూ ఉంటారు, ఇంకా కొంతమంది ఇతరులకి కీడు చేస్తూ నష్టాన్ని కలిగిస్తూ ఉంటారు. అలాగే కొంతమంది పాపాలు చేస్తూ ఉంటే, కొంతమంది మంచి కార్యాలు చేస్తున్నారు.

ఇంకా మనం లోకంలోని పరిస్థితిని గమనిస్తే చాలామంది భగవంతుడు ఎవరో తెలుసుకోకుండా ఆరాధనలు చేస్తూ ఉన్నారు, చాలా కొద్దిమంది మాత్రమే భగవంతుని ఆత్మ తత్వాన్ని తెలుసుకొని దానికితగ్గ ధ్యాన సాధన చేస్తున్నారు. మరి మానవుల ప్రవర్తన ఇలా ఉండడానికి కారణం?

మానవులకు భగవంతుని యొక్క భగవంతుని సృష్టి యొక్క జ్ఞానం లేకపోవడమే. అటువంటి జ్ఞానం లేని వారిని అజ్ఞానులు అంటారు. ఉన్న వారిని జ్ఞానులు అంటారు. అందుచేత మనం గమనిస్తే భగవంతుని సృష్టికీ సంబంధించిన జ్ఞానం ఉన్న వారి ప్రవర్తన ఒక విధంగా ఉంటుంది, అది లేనివారి అంటే అజ్ఞానుల యొక్క ప్రవర్తన వేరే విధంగా ఉంటుంది.

ఒక విధంగా చెప్పాలంటే? ఎవరికైనా కష్టాలు ఉన్నాయంటే వారు

సృష్టికీ, సృష్టి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని లెక్క. అలా ప్రవర్తించడానికి కారణం వారి యొక్క అజ్ఞానం. అందుచేత ఈ దుఃఖం నుండి బయట పడాలంటే అజ్ఞానం తొలగించుకోవాలి, జ్ఞానం పొందాలి, ఆధ్యాత్మిక త్రిరత్నాలు పాటించాలి.

అప్పుడు ఎవరిలోనైనా సరే నెమ్మదిగా జ్ఞానం పెరుగుతుంది. అందుచేత జ్ఞానం పెరిగే కొద్దీ ఎలాంటి మార్పులు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

1) సహజంగా జ్ఞాని ప్రాపంచిక విషయాల పట్ల విరక్తి కలిగి ఉంటాడు. ప్రాపంచిక విషయాలంటే సంసారం, ధనం, పిల్లల మీద జ్ఞానికి ఆసక్తి వుండదు.

కానీ అజ్ఞాని ప్రాపంచిక విషయాలు పట్ల ఆసక్తి కలిగి ఉంటాడు. ఆత్మ విషయాల పట్ల విరక్తి ప్రదర్శిస్తూ ఉంటాడు అంటే ఇష్టం ఉండదు. ఆత్మ గురించి చెప్పినా, జ్ఞానం గురించి చెప్పినా బోర్ కొడుతూ ఉంటుంది.

ఇక్కడ జ్ఞానులు అజ్ఞానులు కూడా రకరకాల స్టేజిల్లో ఉంటారు. మీరు ప్రాపంచిక విషయాల పట్ల ఎంత విరక్తి ప్రదర్శించగలుగుతూ ఉంటే, మీరు అంత జ్ఞానం పొందినట్టు లెక్క. ఇది ఎవరినీ అడగనక్కర్లేదు.

పెద్దలు చెప్తారు కదా "విషయ విరక్తి, ఆత్మ ఆశక్తి ఉండాలి" అని.

అందుచేత ఇవి మీలో ఏంత శాతం వుందో చూస్కోండి. ఆ శాతాన్ని పెంచుకునే ప్రయత్నం చేయండి.

ఇక్కడ విరక్తి అంటే వదిలేయడం కాదు. మమకారం లేకుండా వుండడం. పత్రిగారు సంసారం వదలమని ఎవరికీ చెప్పలేదు, సంపాదనలు వదిలేయమని కాని, సుఖాలను వదిలేయమని కాని చెప్పలేదు. అన్నీ అనుభవిస్తూనే మనం చేయాల్సిన పని మనం చేయాలన్నారు. "సంసారంలో నిర్వాణం" అని ఆచార్య నాగార్జున చెప్పిన దాన్ని పత్రి గారు మనకి చెప్పారు.

2) జ్ఞాని దుఃఖంలో కూడా ఆనందంగా జీవిస్తాడు.

కాని అజ్ఞాని ఆనందంగా ఉండవలసిన సందర్భాల్లో కూడా దుఃఖిస్తాడు.

తెలుసుకోండి జ్ఞానం కలిగిన వాడు దుఃఖం కలిగినా విచారించడు. నా బ్రతుకిలా అయిపోయిందే అని బాధపడడు. ఎప్పటిలాగే ఆనందంగా

వుంటాడు. కానీ ఎవరికి ఏమి అయినా సేవ చేస్తాడు, ఉపశమనం కలిగిస్తాడు.

అందుచేత ఏడుస్తున్నారు అంటే అజ్ఞానంలో ఉన్నట్టే. అలాంటి వాడు నిజంగా దగ్గరి వాళ్ళకి చేయవలసిన సాయం కూడా చేయలేడు.

3) జ్ఞాని కోరికలను అదుపులో ఉంచుకుంటాడు. కానీ అజ్ఞాని కోరికలకు బానిస అవుతాడు.

జ్ఞానికి కోరికలు ఎందుకు అదుపులో ఉంచుకుంటాడు? అంటే “శ్వాస మీద ధ్యాస” ధ్యానం తీవ్రంగా చేయడం వల్ల మనసు అదుపులో ఉంటుంది. మనసు అదుపులో ఉంటే కోరికలు అదుపులో ఉంటాయి.

అజ్ఞాని ధ్యానం చెయ్యడు, మనసు అదుపులో ఉండదు. మనసు అదుపులో లేనివాడికి, కోరికలే కాదు అరిషడ్ వర్గాలు కూడా అదుపులో వుండవు.

4) జ్ఞాని ఆశపడడు. కానీ అజ్ఞాని అన్నిటికీ ఆశపడతాడు.

జ్ఞాని వాడిని చూసీ, వీడిని చూసీ, అది చూసీ, ఇది చూసి ఆశపడడు. కానీ అజ్ఞాని చూసిందల్లా కావాలనుకుంటాడు. ఎన్నివున్నా తృప్తి పడడు.

మొన్న యూట్యూబ్ లో వేశాడు. సినిమా యాక్టర్ ప్రభాస్ కి పది కార్లు ఉన్నాయట.. 9 కోట్లూ, 8 కోట్లూ ఒకటి 6 కోట్లూ అలా కార్లు ఉన్నాయని యూట్యూబ్‌లో వేశారు. మరి అన్ని కార్లలలో తిరుగుతారా అంటే ఏం తిరుగుతారు?

ముఖేష్ అంబానీకి ముంబైలో బిల్డింగు వుంది. ఆ 24 అంతస్తుల బిల్డింగ్‌లో ఆరు అంతస్తులు పాత కార్లు పార్కింగేనట. దీనిని బట్టి ఎన్ని కార్లు వుంటాయో ఆలోచించండి.

ఇవన్నీ ఎందుకు చెప్తానంటే? ఎవరైనా సరే తనకున్న దాంట్లో తృప్తిపడి, తన పరిధిలో తాను జీవించాలి. ఇతరులతో పోల్చుకోకూడదు. ఎందుచేతనంటే? మీకు లాభించేది జ్ఞానం, మీ కూడా వచ్చేది జ్ఞానం. దాన్ని పెంచుకునే ప్రయత్నం చేయాలి. అంతేకాని ఉండని వాటి గురించి మనకెందుకు? గొప్పలెందుకు? ఎవడేం చేసుకుంటే మనకెందుకు?

5) జ్ఞాని జ్ఞానాన్ని పెంచుకుంటాడు. ఆ జ్ఞానమే అతన్ని రక్షిస్తుంది. కానీ అజ్ఞాని ధనాన్ని పెంచుకుంటాడు. ఆ ధనాన్ని అజ్ఞానే రక్షించుకోవాలి. ఇంకెవరూ రక్షించరు.

6) జ్ఞాని ఉన్నదానితో తృప్తిగా జీవిస్తాడు. కానీ అజ్ఞానికి ఎన్ని ఉన్నా తృప్తి ఉండదు.

7) జ్ఞాని ఉన్నదాన్ని పంచుతాడు. కానీ అజ్ఞాని ఏది పంచలేడు.

జ్ఞాని వాడికున్న దాంట్లో ఎంతఉంటే అంత, పంచుతాడు. రూ.100 వుంటే రూ.10 ఇస్తాడు. లక్ష ఉంటే వెయ్యో లేదా పదివేలో ఇస్తాడు. కాని పంచలేక పోతున్నారు అంటే వారు ఇంకా అజ్ఞానంలో ఉన్నట్టే లెక్క.

8) జ్ఞాని ఇవ్వకుండా ఉండలేడు. అలా ఇస్తూనే ఉంటాడు. కానీ అజ్ఞాని ఇవ్వలేడు.

9)ఆత్మ జ్ఞాని అంతా ఒకటే అనుకుంటాడు. కానీ అజ్ఞాని అంతా వేరే వేరే అనుకుంటాడు.

10) ఆత్మ జ్ఞాని అందర్నీ ప్రేమిస్తాడు. తన వారితో సహా అందరిని సమానంగా భావిస్తాడు.

కానీ అజ్ఞాని అందర్నీ ద్వేషిస్తాడు. తన వారిని ప్రత్యేకంగా చూస్తాడు. ఇతరులను వేరే విధంగా చూస్తాడు. ఒక రకంగా రాగద్వేషాలు ప్రదర్శిస్తాడు.

11) జ్ఞాని ఇతరుల కోసం ఆలోచిస్తాడు. పత్రి గారు తన కోసం కంటే ప్రజల కోసం ఎక్కువ పాటు పడ్డారు. కానీ అజ్ఞాని తనకోసం తన వాళ్ళ కోసం ఆలోచిస్తాడు.

12) జ్ఞాని ఇతరుల ఆనందం కోసం పాటుపడతాడు. కానీ అజ్ఞాని తన ఆనందం కోసమే చూసుకుంటాడు.

13) జ్ఞాని లోక కళ్యాణకరమైన కార్యక్రమాలు చేస్తాడు. వాటిని ప్రోత్సహిస్తాడు, వాటికి సహకరిస్తాడు. కానీ అజ్ఞాని అటువంటి కార్యక్రమాలు నిర్వహించడు, ప్రోత్సహించడు, సహకరించుడు.

14) జ్ఞాని చేయకూడని పనులు చెయ్యడు. అందుచేత కష్టాలు రావు

పైగా  చేయవలసిన పనులే చేస్తాడు. అందరికీ లాభం కలిగించే పనులే చేస్తాడు. అందుచేత భవిష్యత్తులో అంతా ఆనందమే, అన్ని లాభాలే, దుఃఖం ఉండదు.

కానీ అజ్ఞాని చేయకూడని పనులు చేస్తాడు. అందరికీ నష్టం కలిగించే పనులు చేస్తాడు, చివరికి కష్టాల పాలవుతాడు, దుఃఖంలో జీవిస్తాడు.

15) జ్ఞాని ఇతరుల గొప్పతనాన్ని, విశిష్టతలను చూస్తాడు. అజ్ఞాని ఇతరులలో లోపాలనే చూస్తాడు. ఎవరైతే ఇతరుల లోపాలు చూస్తాడో వాడు అజ్ఞాని అనే  లెక్క.

16) జ్ఞాని తను చేసే పని ధర్మమా? కాదా? అని చూస్తాడు. తన గురించి ఇతరులు ఏమనుకున్నా లెక్కచేయడు. ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచించడు. తను చేసింది కరెక్టా, కాదా అని చూసుకుంటాడు.

కానీ అజ్ఞాని ఇతరులు ఏమనుకుంటారో అని చేయవలసింది కూడా చేయడు.

17) జ్ఞాని అరిషడ్వర్గాలు అదుపులో ఉంచుకుంటాడు. కానీ అజ్ఞానికి అరిషడ్వర్గాలు అదుపులో ఉండవు. అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉండవు.

18) జ్ఞానికి త్రికరణశుద్ధి ఉంటుంది. కాని అజ్ఞానికి ఉండదు.

19) జ్ఞానికి ధర్మం తెలుస్తుంది. ధర్మాచరణ ఉంటుంది. కాని అజ్ఞానికి ధర్మం తెలీదు, ధర్మాచరణ ఉండదు.

20) జ్ఞాని ద్వంద్వాలలో సమస్థితిలో ఉంటాడు. (ద్వంద్వాలు అంటే శీతోష్ణాలు, గెలుపు ఓటములు,  నిందాస్తుతులు, సుఖదుఃఖాలు, మానవమానాలు)

కానీ అజ్ఞానికి వీటిలో సమస్థితి ఉండదు.

21) జ్ఞానికి మాటమీద ఎరుక ఉంటుంది, అదుపు ఉంటుంది. కానీ అజ్ఞానికి రెండు ఉండవు.

22) జ్ఞాని సృష్టి నియమాలూ, ధర్మాలూ, సిద్ధాంతాలూ తెలుసుకుంటాడు. వాటి ప్రకారం నడుచుకుంటాడు. కాని అజ్ఞాని తెలుసుకోడూ, నడుచుకోడు.

23) జ్ఞాని సృష్టికి అనుగుణంగా జీవిస్తాడు.

కానీ అజ్ఞాని సృష్టికి విరుద్ధంగా జీవిస్తాడు. ఎందుకంటే అజ్ఞానికి ఇవన్నీ తెలీవు.

24) జ్ఞాని సృష్టి నిర్ణయాన్ని గౌరవిస్తాడు.

కానీ అజ్ఞాని సృష్టి నిర్ణయాన్ని గౌరవించ లేడు, పైగా విమర్శిస్తాడు. తద్వారా సృష్టిని అవమానించిన వాడు అవుతాడు, నష్టపోతాడు.

మీరు చూడండి విపరీతంగా వర్షాలు పడితే ఏమంటారు? పాడు వర్షాలు అంటారు. అవి ఎందుకు పడుతున్నాయో? ఆ కారణమేంటో? సృష్టి అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకుందో! వీరికి ఏమి తెలుసు.

అలాగే విపరీతమైన ఎండలు కాస్తే పాడు ఎండలు అంటారు, చంపేస్తున్నాయి అంటారు. అలా సృష్టిలో జరుగుతున్న వాటిని విమర్శిస్తారు.

కాని సృష్టిలో జరుగుతున్నవన్నింటినీ గౌరవించాలి. కానీ అజ్ఞాని సృష్టిని అవమానించినవాడు అవుతాడు, నష్టపోతాడు.

అందుచేత ఇందులో వేటినైనా మీరు ఇంకా పాటించట్లేదు అంటే వాటి మీద మీకు ఇంకా అవగాహన లేదని గుర్తుంచుకోండి.

అందుచేత వాటిని అవగాహన చేసుకోండి.

చూడండి అజ్ఞాని ధర్మాన్ని ఆచరించడు. కారణం ధర్మమంటే తెలియదు. మరి ధర్మాన్ని ఆచరించకపోతే వచ్చే నష్టాలుకూడా తెలియవు. వాటి యొక్క పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుంది అన్నది తెలియదు.

అందుచేత పై వాటిలో ఏదైనా ఆచరించకపోతే వాటన్నిటి మీద బాగా స్టడీ చేయాలి. సృష్టి సిద్ధాంతాలు, నియమాల గురించి కూడా తెలుసుకోవాలి. ఒకవేళ మనకు అవగాహన లేకపోతే తెలుసుకుని వాటిని ఆచరించే ప్రయత్నం చేయాలి. ఇవన్నీ జ్ఞానం వున్నవారికి తెలుస్తుంది.

అందుచేత జ్ఞానం సంపాదించుకోండి. ఆధ్యాత్మిక త్రిరత్నాలు పాటించండి.

# జ్ఞానం పొందడం వల్ల వచ్చే లాభాలు

ఈ జ్ఞానం మన కూడా వస్తుంది కాబట్టి ఈ జ్ఞానం మీద ఎవరైనా ఆసక్తి చూపించాలంటే ముందు జ్ఞానం పొందడం వల్ల వచ్చే లాభాలు ఏమిటో తెలుసుకోవాలి.

ఇప్పుడు ఈ ధ్యానంలోకి కొన్ని లక్షల మందే వచ్చారు. కానీ చాలా కొద్ది మందే జ్ఞానానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. కారణం ఈ ధ్యానంలోకి వచ్చిన వాళ్ళు దేహ లాభాలకు, కోరికలకు, సమస్యలకు, అనుభవాలకు, శక్తులకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. నాకు ఆయన కనపడ్డాడు, ఈయన కనపడ్డాడు, గతజన్మలు చూసుకున్నాను, నాకు మూడో కన్ను తెరుచుకుంది అని చెప్తూ వుంటారు. కాని ధ్యానం చేసేది వీటన్నిటికోసం కానే కాదు. ధ్యానం అన్నది జ్ఞానం కోసం. ధ్యానం చేస్తూవుంటే జ్ఞానం పొందేలోపులో ఇలాంటివి ఎన్నో వస్తాయి.

ఉదాహరణకి ఎవరైనా మిల్లులో ధాన్యం వేసేది బియ్యం కోసం వేస్తారు. అంతేకాని ఊకపొట్టు కోసం, తౌడు కోసం, చిట్టు కోసం, నూకల కోసం వెయ్యరు. ధాన్యం వేసినోడు బియ్యం కోసం చూడకుండా వూకపొట్టు, తౌడూ, చిట్టూ, నూకలు చూసి పొంగిపోతే! వాడినేమనాలి.

అలాగే ధ్యానం చేసే వాడికి జ్ఞానం వచ్చిందో లేదో చూసుకోవాలి. అంతేకాని అది మానేసి నాకు రోగం తగ్గింది, నా కోరికలు తీరాయి, నాకు అనుభవాలు వచ్చాయి, నాకు ఆ లాభం వచ్చింది, అంటే... అవేమైనా పెద్దలాభాలా? ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకునే లోపల ఇవన్నీ సహజంగా వస్తాయి. అవన్నీ బైప్రొడక్ట్స్ అంటారు.

ధాన్యం వేసినప్పుడు బియ్యం అన్నవి అసలు ప్రోడక్ట్, దానికి ముందు వచ్చే వూకపోట్టు, చిట్టు, నూకలు అన్నవి బైప్రొడక్ట్స్. మరి బియ్యం చూడకుండా వూకపొట్టుతో సంతృప్తి పడితే వాడిని ఏమనాలి? అసలును వదిలేసి కొసరును చూసి తృప్తిపడేవాడు ఏంత తెలివితక్కువవాడు, మూర్ఖుడు కాక మరి ఎవరు?

అలాగే ధ్యానం చేసేటప్పుడు జ్ఞానం వచ్చేలోపు వచ్చేవన్నీ బైప్రొడక్ట్స్. అసలైన ప్రోడక్ట్ ఏది అంటే 'జ్ఞానం'. ఈ 'జ్ఞానం' వంక చూడకుండా ఇంకేవేవో రోగాలు, లాభాలు చూస్తే వాడినికూడా తెలివితక్కువవాడు, మూర్ఖుడు అంటారు.

అందుచేత జ్ఞానం గొప్పతనం ఇప్పుడు తెలుసుకుందాం. జ్ఞానం పొందితే వచ్చే లాభాలేంటో తెలియక. రోగాలమీద, డబ్బు మీద దృష్టి పెడుతున్నారు, సంసారం మీద దృష్టి పెడుతున్నారు, సంపదల మీద దృష్టి పెడుతున్నారు. కాని ఒక్కరూ జ్ఞానం మీద దృష్టి పెట్టట్లేదు. అందుచేత ముందు ఈ జ్ఞానం వల్ల వచ్చే లాభాలు ఏంటో తెలుసుకుందాం.

జ్ఞానం పొందితే ముఖ్యంగా రెండు రకాల లాభాలు పొందవచ్చు.

1) ఇహంలో పొందే లాభాలు.

2) పరంలో పొందే లాభాలు.

ఈ రెండింటి గురించి తెలుసుకునే ముందు జ్ఞానం అంటే ఏమిటో తెలుసుకుందాం.

జ్ఞానమంటే "ఉన్నదాన్ని గుర్తించడం". ఈ జ్ఞానంలో పరాకాష్టనే 'విజ్ఞానం' అంటారు. 'విజ్ఞానం' అంటే గుర్తించిన దాన్ని ఆచరించడం.

మరి ఈ సృష్టిలో ఉన్నదేమిటి? ఉన్నది ఒకటే ఒక్కటి. అదే 'ఆత్మ'. 'ఆత్మ'ను గుర్తించడమే, 'ఆత్మ'ని తెలుసుకోవడమే 'జ్ఞానం.' పత్రి గారు 'నేను దేహం కాదు, నేను ఆత్మను' అని తెలుసుకోవడమే ' జ్ఞానం ' అని చెప్పారు. ఎందుచేతనంటే సృష్టిలో ఉండేది 'ఆత్మ' ఒక్కటే. అటువంటి ఆత్మను ఎవరైతే గుర్తిస్తారో! తెలుసుకుంటారో! వారే జ్ఞాని.

మిగిలిన వారంతా అజ్ఞానులే. అలా ఆత్మను గుర్తించిన వారు సమస్యల నుండి, బాధల నుండి, దుఃఖాల నుండి బయటపడతారు. గుర్తించని వారు అజ్ఞానంలో ఉన్నట్టే. వారు ఎన్ని జన్మలెత్తినా అంతులేని దుఃఖంతో, నరకం అనుభవిస్తారు.

అందుచేత ఈ 'జ్ఞానం' పొందితే వచ్చే లాభాలు తెలుసుకుందాం.

**1) ఇహంలో వచ్చే లాభాలు:-**

1) జ్ఞానికి నేను దేహం కాదు ఆత్మ అన్నది స్పష్టంగా తెలుస్తుంది. తానే కాదు అందరూ ఆత్మలే అన్నది కూడా బాగా అర్థమౌతుంది.

2) జ్ఞాని అందరూ ఆత్మలే అని తెలుసుకోవడం వల్ల, అంతా ఒకటే అందరూ సమానమే అన్న అవగాహన కలుగుతుంది.

అన్నమాచార్యుల వారు చెప్పారు కదా? బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే అని చెబుతూ.. "హీనాధికములు ఎందూ లేవు అందరికీ శ్రీహరే అంతరాత్మ." అన్నారు.

అంటే ఈ సృష్టిలో హీనమైన జాతి అని, అధికమైన జాతి అని ఏమీ లేవు. హీనమైన వాడూ, అధికమైన వాడూ అంటూ ఎవరూ లేరు. కారణం అందరికీ ఆ శ్రీహరే, ఆ భగవంతుడే అంతరాత్మ. అంటే అంతరంలో ఉండే 'ఆత్మ' అని అన్నమాచార్యులు వారు ఎంత స్పష్టంగా చెప్పారో! ఈ విషయం జ్ఞానికి అర్థమవుతుంది. అందుచేత ఇది అర్థమైన జ్ఞాని ఎవరినీ ద్వేషించడు, అవమానించడు, మోసగించడు, నష్టపరచడు, కష్టాలకు గురిచేయడు.

3) జ్ఞాని ఏ జీవులను హింసించడు. ముఖ్యంగా హింసకు కారణమైన మాంసభక్షణ చేయడు. అందుచేత రోగాలు, కష్టాలు రావు.

4) జీవితంలో జ్ఞానికి కష్టాలు ఉండవు. ఒకవేళ ఉన్నా శాంతిగా, సంతోషంగా, ఆనందంగా జీవించగలుగుతాడు.

5) జ్ఞాని అన్నిటితో అంటే అన్ని జీవులతో, మానవులందరితో స్నేహంగా ఉంటాడు.

మరి అటువంటి జ్ఞానులు అడవుల్లో తపస్సు చేస్తున్నప్పుడు, ధ్యాన సాధన చేస్తున్నప్పుడు క్రూర మృగాలు వచ్చినా వాళ్ళని ఏమీ చెయ్యవు.

6) జ్ఞాని దేహానికి ప్రాముఖ్యం ఇవ్వడు. ఆత్మకి ఎక్కువ ప్రాముఖ్యమిస్తాడు. ఎందుచేతంటే దేహం శాశ్వతం కాదు, ఉండదు. అందుచేత ఈ దేహంతో ఆత్మకి లాభం కలిగించే పనులే చేస్తాడు.

7) జ్ఞాని "శ్వాస మీద ధ్యాస" ఉంచి తీవ్రాతి తీవ్రమైన ధ్యాన సాధన

చేస్తాడు.

8) జ్ఞాని సమయాన్ని వృధా చేయడు. సమయాన్నే కాదు తన ధనాన్నీ, వాక్కునీ, శక్తినీ మేధస్సుని, జీవితాన్ని కూడా వృధా చేయడు. అన్నింటినీ ఆత్మ లాభానికే  ఉపయోగిస్తాడు.

9) జ్ఞాని మాయను జయిస్తాడు. మాయ నుండి బయట పడతాడు.

10) జ్ఞానం పొందడం వల్ల కర్మలన్నీ దగ్ధం చేసుకుంటాడు. దుఃఖం నుండి పూర్తిగా బయటపడతాడు.

11) జ్ఞానం పొందిన వాడు తాను ఆత్మ అని తెలుసు కాబట్టి తనకి మరణం లేదని తెలుసు.

12) జ్ఞానికి మరణ భయం ఉండదు. మరణమే లేనప్పుడు మరణ భయం ఎక్కడుంటుంది?

13) జ్ఞాని మరణించిన తర్వాత ఏం జరుగుతుందో ముందే తెలుసుకుంటాడు. అందుచేత జీవితంలో ఎన్నో లాభాలు పొందగలుగుతాడు.

14) జ్ఞాని భూమ్మీద మరణించిన తరువాత లాభించే పనులే చేస్తాడు.

15) జ్ఞానికి మరణం అన్నది లాభం అని తెలుసు. కారణం జ్ఞానం వున్నవాడు గొప్ప లోకాలకు చేరుకుంటాడు. తర్వాత గొప్ప జన్మలువస్తాయి. అందుచేత మరణం లాభం కనుక మరణానికి భయపడడు.

మరణించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. అంతేకాదు తాను మరణిస్తానని ముందే చెబుతాడు.

16) జ్ఞానికి మరణించిన తర్వాత ఏం జరుగుతుందో తెలుసుకోవడం వల్ల జీవితంలో అన్నింటి మీద మమకారం పోతుంది. ముఖ్యంగా భార్య మీదా, పిల్లల మీదా, భర్త మీదా, ధనం మీదా మమకారం పోతుంది.

17) జ్ఞానికి అన్నీ తెలియడంవల్ల, మరణం కూడా సంబరమే.

18) జ్ఞానం పొందిన వారి ప్రవర్తన, పనులు, ప్రాముఖ్యతలూ, బాధ్యతలూ, మాటలూ మారిపోతాయి.

19) జ్ఞానికి రకరకాల భౌతిక ఆకర్షణల మీద వ్యామోహం పోతుంది.

అంటే పదవులూ, అవార్డులూ, రివార్డులూ, బిరుదులూ, మెడల్స్ లాంటి వాటిమీద వ్యామోహం ఉండదు. వాటికోసం జీవితం వృధా చెయ్యడు.

20) అందరికంటే గొప్పగా ఉండాలని జ్ఞాని అనుకోడు. ఆ గొప్పతనం సంపాదించడం కోసం జీవితం వృధా చెయ్యడు. అంతే కాదు తప్పులు చెయ్యడు, పాపాలు చెయ్యడు, అధర్మంగా వ్యవహరించడు.

21) జ్ఞాని తన తోటి వారిని కూడా జ్ఞానులుగా చేయడానికి ఎంతో కృషి చేస్తాడు. అందుచేత అందరి మన్ననలూ, గౌరవం పొందుతాడు. అందుచేత భూమ్మీద జ్ఞానం పొందాడు అంటే వాడికి అన్నీ లాభాలే..

**2) పరంలో వచ్చే లాభాలు:-**

1) జ్ఞానం పొందడం వల్ల మమకారం పోతుంది. అందుచేత మరణించిన తర్వాత భూమ్మీద ఉండరు. భూమిమీద తన పని అయిపోయిందని తెలుసు కాబట్టి తనని తీసుకు వెళ్లడానికి వచ్చినటువంటి సహాయకుల కూడా పైలోకాలికి వెళ్ళిపోతాడు.

2) ఈ భార్యా, పిల్లలూ, సంపదలూ ఏవి ఉండేవి కావు, తాత్కాలికం అనే సంగతి తెలుసు. అందుకే మమకారం పెంచుకోడు.

ఈ జ్ఞానం పొందడం వల్ల, పైలోకాలకు వెళ్లిపోవడం వల్ల మరణించిన తరువాత ప్రేతాత్మకగా మారడు. తాను చేరవలసిన లోకాలకు చేరుకుంటాడు. తర్వాత తాను చేయవలసిన పనుల మీద దృష్టి ఉంచుతాడు.

అందుచేత ఎంతో సమయాన్ని ఆదా చేసుకుంటాడు. చూడండి ప్రేతాత్మలుగా అయిన వాళ్ళు కొన్ని వందల సంవత్సరాలు కాదు, వేల సంవత్సరాలు కూడా నష్టపోతారు.

3) జ్ఞాని తన జీవిత లక్ష్యం 'పూర్ణాత్మ కావడమని' తెలుసుకుంటాడు. అంతేకాదు తన జీవిత గమ్యం సత్యలోకం చేరుకోవడం అని తెలుసుకుంటాడు.

4) జ్ఞానం పొందడం వల్ల సృష్టిలో ఎన్నో లోకాలు ఉన్నాయని తెలుసుకుంటాడు. ముఖ్యంగా తాను ఊర్ధ్వ లోకాలైనటువంటి మహాలోకం, తపోలోకం, చేరడమే కాదు తన గమ్యమైనటువంటి సత్యలోకం చేరడమేనని

తెలుసుకుంటాడు.

5) జ్ఞానం పొందడం వల్ల జనాలోకం దాటి పైన ఉన్న ఉన్నత లోకాలకు చేరుకోవడం వల్ల గొప్ప గొప్ప వారి సాంగత్యం పొందవచ్చు. వారి నుండి ఎంతో జ్ఞానం పొందొచ్చని కూడా తెలుసుకుంటాడు. అవన్నీ కూడా వాడి భవిష్యత్తులో ఎంతో లాభం చేకూరుస్తాయని తెలుసుకుంటాడు.

6) జ్ఞాని ఉన్నత లోకాలను చేరుకుంటాడు. కాబట్టి మరుజన్మ తీసుకునేటప్పుడు వాడికి నచ్చిన జన్మ తీసుకునే అవకాశం అంటే ఛాయిస్ వుంటుందని తెలుసుకుంటాడు.

7) ఆత్మజ్ఞానాన్ని పొందిన వారు ప్రస్తుతం తాను ఉండే భూమి తనకి పరలోకమని తెలుసుకుంటాడు.

ఇలా జ్ఞానం పొందితే ఇహంలోనే కాదు పరంలో కూడా ఎన్నో లాభాలు పొందుతాడు. తన లక్ష్యాన్ని సాధిస్తాడు, తన గమ్యాన్ని చేరుకుంటాడు. కనుక ఉండని వాటికి ప్రాముఖ్యం ఇవ్వడు. కూడా వచ్చే వాటికి, ఉండేవాటికి ప్రాముఖ్యం ఇవ్వాలని తెలుసుకుంటాడు

మరి వశిష్టుల వారు చెప్పినటువంటి ఆధ్యాత్మిక త్రిరత్నాలైనటువంటి.

1) శ్వాస మీద ధ్యాస ధ్యానం.


2) ఆధ్యాత్మిక పుస్తక పఠనం.

3) ఆధ్యాత్మిక గురువుల బోధనలు వినడం.

ఇవి మానకుండా రెగ్యులర్గా చేయాలి. ఖాళీ సమయాన్ని జ్ఞానానికే కేటాయించుకోవాలి. ఎంజాయ్మెంట్స్ కి, ఎంటర్టైన్మెంట్ కి, కాలక్షేపానికీ ఉప యోగించకూడదు.

అందుచేత ఎవరైనా సరే కూడా వచ్చేవాటికి ప్రాముఖ్యం ఇవ్వాలి.

బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో..



**బ్రహ్మర్షి తటవర్తి రాఘవరావు** మరియు **బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి గార్లు** అందిస్తున్న

# ఆత్మజ్ఞాన సందేశాలు

క్రింద ఇవ్వబడిన ప్రసార మాధ్యమాల ద్వారా వినవచ్చును మరియు చదవవచ్చును

## 1. Zoom మరియు YouTube :-

**a)** ప్రతిరోజూ ఉదయం **Zoom** లో **4 to 6.30 a.m. Silence Meditation** మరియు **6.30 to 7.30 a.m.** వరకు **తటవర్తి దంపతుల ఆత్మజ్ఞాన సందేశాలు**

**Zoom I.D. :2413823868, Password : RAO**

**b)** పై కార్యక్రమము **6.30 to 7.30 a.m.** వరకు **Youtube**లో కూడా **Live** ఇవ్వబడుతుంది.

**c)** ఎవరైతే **TVR & TRL Whatsapp** గ్రూపులో వుంటారో వారికి **Zoom Link & You Tube Links** మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా **save** చేసుకోవాలి.

**d)** తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే **www.tst.org.in Open** చేసిన తర్వాత **Join in Whatsapp group** లింక్ మీద నొక్కండి.

## 2.YouTube Channel లో ప్రసారమయ్యే కార్యక్రమములు :-

**a) Channel Name : Tatavarthy Veera Raghava Rao.** ఇందులో 2000 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

**b)** అలాగే **PMC** వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క **YouTube Channel** ప్రారంభించారు. **Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao**

**c)** తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు **Tatavarty Spiritual Trainees** ఛానెల్‌లో చూడండి.

**d) Direct** గా **YouTube app** లోకి వెళ్ళి **search bar** లో **Tatavarthy Veera Raghava Rao** అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## 3. YouTube ఛానెల్‌ని subscribe చేసుకోవాలంటే :-

**a) Whatsapp group** లో మీకు పంపబడుతున్న **Youtube** లింక్ మీద నొక్కినప్పుడు **Tatavarthy Veera Raghava Rao** ఛానెల్ **open** అవుతుంది. **Open** అవ్వగానే **subcribe** కనిపిస్తుంది. దాని మీద నొక్కితే **subscribe** అవుతారు. ప్రక్కనే వున్న **bell button** నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

4. తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము :-

**website address : www.tst.org.in**

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

6. **ఆత్మజ్ఞాన పుస్తకాలు :**

**పత్రీజీ వ్రాసిన సుమారు 50 పుస్తకాలను 7 పుస్తకములలో కూర్చబడినవి. సెట్ వెల - రూ.1,000/-లు**
**తటవర్తి రాఘవరావు గారి 40 పుస్తకాల సెట్ వెల - రూ.2,000/-లు**

YouTube Play lists

**1) యోగవాశిష్టం - ఆత్మజ్ఞాని ప్రవర్తన ఎలా వుంటుంది?, (2) చివటం అమ్మవారి సందేశాలు-2 వీడియోలు, (3) ముమ్మిడివరం బాలయోగి సందేశాలు-12 వీడియోలు, (4) మాతా మాణిక్యేశ్వరి సందేశాలు-9 వీడియోలు, (5) షిరిడీ సాయి సందేశాలు-112 వీడియోలు, (6) పత్రీజీ జ్ఞాన సందేశాలు-37 వీడియోలు, (7) కోరికల వల్ల నష్టాలు-19 వీడియోలు, (8) దుఃఖం వల్ల లాభాలు-2 వీడియోలు, (9)విగ్రహారాధన-120 వీడియోలు, (10) మంత్రపుష్పం-23 వీడియోలు, (11) వికృతి - ప్రకృతి-సంస్కృతి-100 వీడియోలు, (12) గురువు యొక్క సహాయం-13 వీడియోలు, (13) భార్యాభర్తలు గొడవపడకూడదంటే? (14) మాస్టర్ ట్రైనింగ్ క్లాస్, (15) ధ్యానం-35 వీడియోలు, (16) స్త్రీ జన్మల్లో నేర్చుకొనేవి - పురుష జన్మల్లో నేర్చుకొనేవి, (17) దేవుడికి దయ లేదా దేవుడి దయ కలగాలంటే?-11 వీడియోలు, (18) ఉపమాన ధ్యాన సందేశాలు, (19) ఆరోగ్య సమస్యలు.**

పై పుస్తకముల కొరకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి

**తటవర్తి వీరరాఘవరావు గారు : 9440309812**
**మధు : 7893917364**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) భగవంతుడంటే - రూ.130/-
5) సత్యమార్గం - రూ.160/-
6) ఆత్మ శాస్త్రం - రూ.130/-
7) ధ్యాన శాస్త్రం - రూ.130/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.160/-
9) ధ్యాన శక్తి - రూ.130/-
10) తెలుసుకోండి - రూ.130/-
11) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
12) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - రూ.160/-
14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
15) గీతాసందేశం - రూ.120/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) కర్మ సిద్ధాంతం - రూ.80/-
18) ధ్యానమంటే ? - రూ.80/-
19) త్రివిధాలు - రూ.80/-
20) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
21) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
22) జ్ఞాన జ్యోతి - రూ.70/-
23) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
24) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
25) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
26) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
27) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
28) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
29) అతీంద్రియ శక్తులు - రూ.60/-
30) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.60/-
31) భూతదయే దైవత్వం - రూ.60/-
32) ఆలోచించండి - రూ.60/-
33) షిరిడీ సాయి సందేశాలు - రూ.60/-
34) సంకల్పమంటే? - రూ.50/-
35) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
36) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
37) నిర్వాణ మార్గం - రూ.50/-
38) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.50/-
39) సత్యం - రూ.40/-
40) చక్రాలు - రూ.40/-
41) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
42) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
43) మౌన ధ్యానం - రూ.40/-
44) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
45) శాకాహారమే మానవాహారం - రూ.15/-
46) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్: 9440309812, 9490171853



ఈ జన్మలో మనం కష్టపడి సాధించింది, వృధా కాదు, మరుజన్మకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ జన్మలో నేర్చుకున్నవి, సాధించినవి తర్వాత జన్మకి ఉపయోగ పడతాయి. అలా ఈ జన్మలో కష్టపడింది కానీ, సాధించింది కానీ ఏది వృధా కాదు. అంతా ఏమనుకుంటారంటే? చచ్చిపోతే అంతా అయిపోతుంది, ఇంక ఏమీ వుండదని అనుకుంటారు. కాని చచ్చిపోయినా కూడా మనం వుంటాము, అంతేకాదు చేసింది, సాధించింది కూడా వృధా కాదు. అందుచేత ఇక్కడ మనం చేసేది, సాధించేవి, నేర్చుకునేవి, మన కూడా వచ్చేవి ఏమి ఉన్నాయి?

మన కూడా వచ్చే వాటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు, అవేమిటంటే? 1. వాసనలు, 2. సంస్కారాలు, 3. కర్మలు, 4. జ్ఞానం

ఇక్కడ "వాసనలు" అంటే ఒక రకంగా చెప్పాలంటే "ఆసక్తులు, వాటినే ఇష్టాలు అనవచ్చు".

సంస్కారాలు అంటే "అలవాట్లు".

కర్మలు అంటే "చేసిన పనులు, మాటలు".

జ్ఞానం అంటే "ఆత్మకు లాభించేది", "ఆత్మకు ఉన్నతి కలిగించేది."

ఇవన్నీ కంటికి కనిపించక పోయినా మానవుడు చనిపోయిన తరువాత కూడా వస్తాయి.

రూ.70/-